● ఎక్కడికక్కడ వెలిసిన బెల్ట్ షాపులు ● టీడీపీ నేతల కనుసన్నల్లో నిర్వహణ ● పల్లెలు, కాలనీల్లో అందుబాటులో మద్యం ● బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న వ్యాపారులు ● తూతూమంత్రంగా కేసులు, దాడులతో ఎక్సైజ్ సరి ● నియంత్రణలో వైఫల్యం.. మామూళ్ల వసూళ్లలో అధికారులు



● ధాన్యం సేకరణకు కృత్రిమ మేధ సాయం

● వాట్సాప్ నంబరు అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం

● 7337359375 నంబరుకు హెచ్ఐ అని నమోదు చేస్తే చాలు

స్మార్ట్‌గా కొనుగోళ్లు

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముకోవడానికి పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా కూటమి ప్రభుత్వం ఈ దఫా టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం రైతులు పడిగాపులు పడాల్సి వచ్చేది. అధికారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ధాన్యాన్ని విక్రయించుకోవాల్సిన పరిస్థితి. వీటికి ఫుల్‌స్టాప్ పెడుతూ కూటమి ప్రభుత్వం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేథ) సాయాన్ని తీసుకుంటోంది. రాష్ట్ర పౌరసరఫాల సంస్థ వాట్సాప్ నంబరు 7337349375ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతులు ఈ నంబరు ద్వారా ధాన్యాన్ని ఎప్పుడు విక్రయించుకోవచ్చో వారే స్వయంగా తేదీ, సమయాన్ని ఎంచుకోవచ్చు. దీని వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురవుతున్న ఇబ్బందులు వారికి ఉండవని పౌరసరఫరాల సంస్థ అధికారులు చెప్తున్నారు. రైతులు వాట్సాప్ నంబరుకి ఆంగ్లంలో హెచ్ఐ అని నమోదు చేయగానే వెంటనే ధాన్యం కొనుగోలుకు షెడ్యూల్, రీషెడ్యూల్ చేసుకోండి అని సందేశం వస్తుంది. షెడ్యూల్‌ని క్లిక్ చేయగానే దయచేసి మీ ఆధార్ సంఖ్యని నమోదు చేయమని కోరుతుంది. ఆధార్ నంబరు ఎంట్రీ చేయగానే సమీపంలో ఉన్న ధాన్యం కేంద్రాల జాబితా ప్రదర్శితమౌతుంది. వాటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న వెంటనే తేదీలను ఇస్తుంది. తేదీని ఎంచుకోగానే టైం స్లాట్ ఇస్తుంది. టైంస్లాట్ ఎంచుకున్న తర్వాత ధాన్యం రకాన్ని ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత ఎన్ని బస్తాలను అమ్మదలిచారో చెప్పాలని కోరుతుంది. పరిణామం తెలిపిన తర్వాత రైతు పేరు, గ్రామం, షెడ్యూల్ చేసిన తేదీ, కూపన్ కోడ్ వస్తుంది. ఒకవేళ రీషెడ్యూల్ చేసుకోవాలన్నా ఆ అవకాశం కూడా ఉంటుంది. ఈ-పంట నమోదులో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. రైతు తాను సాగు చేసిన విస్తీర్ణం తక్కువగా ఉండి, ఎక్కువ బస్తాల ధాన్యం విక్రయించాలని చూసినా ఏఐ అనుమతించదు.

వాడవాడలా.. మద్యం



ప్రభుత్వ మద్యం దుకాణాలు పోయి.. ప్రైవేటు వైన్స్ వచ్చేశాయి. కావాల్సిన బ్రాండ్లు కొనుక్కోవచ్చు. తాగొచ్చు. అయితే ఎక్కడో ఉన్న వైన్స్‌కు వెళ్లి కొనుక్కునేందుకు ఇబ్బంది పడకుండా అందుబాటులో కూడా మద్యం దొరికే సౌలభ్యం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రతీ పల్లెలోనూ, పట్టణాల పరిధిలోని కాలనీల్లోనూ ఉంది. ఇంటి నుంచి బయటకు వచ్చి సమీపంలోని బడ్డీ కొట్టుకు వెళ్తే మందు దొరుకుతుండటంతో మందుబాబులు ఖుషీఖుషీగా ఉంటున్నారు. ఆదాయం అధికంగా ఉంటుండడంతో బెల్ట్ షాపుల నిర్వహణకు పలువురు పోటీపడుతున్నారు. ఇదే అవకాశంగా గ్రామాల్లోని అధికార పార్టీ నాయకులు బెల్ట్ షాపుల నిర్వహణకు ముందుకొస్తున్నారు. అధికారులు కూడా తూతూమంత్రంగా దాడులు, కేసులతో సరిపెడుతున్నారు. బెల్ట్ షాపుల నియంత్రణపై అధికారులు దృష్టి పెట్టడంలేదు. దీంతో ప్రతి గ్రామం, కాలనీల్లో ఎనీటైం మద్యం అందుబాటులో ఉంటుంది.





ఆంధ్రజ్యోతి ఫోకస్

ఇటీవల ముప్పాళ్ళ మండలంలోని ఓ గ్రామంలో మద్యం బెల్టు షాపు నిర్వాహకుడిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో పని చేసే కానిస్టేబుల్ ఒకరు కేసు పెట్టించుకుంటావా?, సార్‌తో సెటిల్ చేసుకుంటావా? అంటూ బెదిరించాడు. దీంతో భయపడిన బెల్టు షాపు నిర్వాహకుడు కానిస్టేబుల్ చెప్పినంత డబ్బులు సమర్పించుకుని కేసు లేకుండా బయటపడ్డాడు. ఇలా అధికారులకు బెల్ట్ దుకాణంపై ఫిర్యాదు అందితే దానిని నియంత్రించకుండా కేసులతో బెదిరించి మామూళ్లు పిండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

దొరికితే.. పండుగే



(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చి నెలరోజులు అవుతుంది. ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రైవేట్ వైన్స్ షాపు లకు అనుమతించింది. ఇదే సమయంలో అన్ని ప్రాంతాల్లో, గ్రామాలలో వాడవాడల మద్యం బెల్టు షాపులు కూడా వెలిశాయి. గతంలో ప్రభుత్వ వైన్స్ కావడం.. డిమాండ్ ఉన్న బ్రాండ్లు అందుబాటులో లేక పోవడంతో బెల్ట్ షాపులపై పెద్దగా ఎవరూ దృష్టి సారించలేదు. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులు వైన్స్ నిర్వహిస్తుండటం.. వారి ద్వారా కావాల్సినంత మద్యం, కోరిన బ్రాండ్లు దొరుకు తుండటంతో బెల్ట్‌షాపుల యథేచ్ఛగా వెలిశాయి. వైన్స్ లైసెన్స్‌దారులతో సిండికేటైన కొందరు నేతలు గ్రామాల్లో తమ అనుచరుల ద్వారా బెల్ట్‌షాపులను నిర్వహి స్తున్నారు. ఎక్కడికక్కడ అధికార పార్టీ నేతల అండ ఉండటం, కొన్ని దగ్గర్ల వారి అనుచరులే దుకాణాల నిర్వహి స్తుండటంతో వీటిని అడ్డుకునే వారే లేకుండా పోయారు.

కొన్ని ప్రాంతాల్లో బెల్ట్ షాపుల బెడదతను తట్టుకోలేక స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం ఉండటంలేదు. ప్రతి గ్రామంలోనూ మూడు నుంచి నాలుగు వరకు బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. బెల్టు ద్వారానే ఎక్కువ ఆదాయం వస్తుందని గ్రహించిన మద్యం వ్యాపారులు కూడా వాటిని ప్రోత్సహిస్తున్నారు. బెల్టు నిర్వహించుకునే వారి నుంచి రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు ప్రాంతాన్ని బట్టి వసూలు చేస్తున్నారని సమాచారం. ఈ వసూళ్ల క్రమంలో కొన్ని గ్రామాల్లో నేతలు, మద్యం వ్యాపారుల మధ్య వివాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి.

ఎనీటైం మద్యం..

బెల్ట్ దుకాణాలతో పలు కాలనీల్లో, పల్లెల్లో మద్యం మందుబాబులకు చేరువైంది. కొన్ని గ్రామాల్లో డోర్ డెలివరీ సౌకర్యాన్ని కూడా వ్యాపారులు అమలు చేస్తున్నారని సమాచారం. బెల్ట్‌షాపుల్లో 24 గంటలూ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మందుబాబులు తెల్లవారుజాము నుంచే ఆయా షాపుల వద్ద బహిరంగంగానే మద్యం తాగుతున్నా అధికారులు, పోలీసులు కూడా అటువైపు కన్నెత్తి చూడటంలేదు. బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. అమ్మేవారు కూడా తాము అధికారులను ప్రసన్నం చేసుకునే విక్రయాలు జరుపుతున్నామని చెబుతుండడం విశేషం. బెల్ట్ దుకాణాల బెడదపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు మండిపడుతున్నారు. బెల్టుషాపులు యథేచ్ఛగా నడుస్తున్నా మొక్కుబడి కేసులతో ఎక్సైజ్ అధికారులు సరిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. దాడుల్లో పట్టుబడ్డ మద్యం ఏ షాపు నుంచి వచ్చిందో మూలాలను కనుక్కొని వాటిపై చర్యలు తీసుకోవడంలేదు.

● గుంటూరుకి సమీపంలోని గోర్లవారిపాలెం, రాజీవ్‌గృహకల్ప, పలకలూరు, రాజేశ్వరావుకాలనీ, ఓబులనాయుడిపాలెం, వెంగళాయపాలెం, బుడంపాడు, లాల్‌పురం, నగరంలోని శివారు కాలనీల్లో

(మిగతా 6వ పేజీలో)

డిపాజిట్ కడితేనే బెల్ట్

రేపల్లెలో బెల్టు షాపుల నిర్వహణ కోసం చిన్న గ్రామమైతే రూ.50,000, పెద్ద గ్రామానికి రూ.లక్ష డిపాజిట్ చేసేలా మద్యం షాపులు యజమానులు రేటు ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. కర్లపాలెం మండల పరిధిలో రెండు గ్రామాలలో బెల్టు షాపుల నిర్వహణకు పోటీ అధికంగా ఉండడంతో పంచాయితీ నడుస్తున్నట్లు సమాచారం. వేమూరు నియోజకవర్గ పరిధిలో బెల్టు షాపుల నిర్వహణకు దాదాపు రూ.3 లక్షలు ధర నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి గ్రామాలలో ఇంతకుముందే ఈ బెల్టు షాపులు నిర్వహించిన వారికే ప్రస్తుతం కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. బెల్టు షాపులు ఎక్కడ జోరుగా నడుస్తున్నాయోనని తెలుసుకుని వాటిని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు మద్యం వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. పల్నాడులో మద్యం దుకాణాల నిర్వాహకులు రూ.50 వేలు వసూలు చేసుకుని బెల్ట్‌షాపు నిర్వహణకు అనుమతి ఇవ్వడంతో పాటు అక్కడకు మద్యం సరఫరా చేస్తున్నారు.

రూ.50 వరకు అదనం..

రూ.లక్షలు కట్టి వైన్స్ లైసెన్సు పొందిన వ్యాపారులు బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు అదనంగా రూ.10 తీసుకుని బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. వారు బ్రాండ్లను బట్టి రూ.40 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. తమ ప్రాంతం నుంచి వైన్స్‌కు వెళ్లకుండా అందుబాటులో మద్యం దొరుకుతుండటంతో మందుబాబులు అదనపు మొత్తాన్ని భారంగా భావించడంలేదు. ఏ సమయంలోనైనా కావాల్సిన మందు దొరుకుతుండటంతో మందుబాబులు బెల్ట్ దుకాణాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు.

పంచాయతీలకు కాసుల వర్షం

ప్రభుత్వం నుంచి రూ.70.04 కోట్లు విడుదల

తీరనున్న సమస్యలు.. నిధులపై పాలకవర్గాల హర్షం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిధుల లేమితో కునారిల్లిపోతున్న పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. వైసీపీ హయాంలో కేంద్రం నుంచి విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధులను సైతం దారి మళ్లించి పంచాయతీలను నిర్వీర్యం చేసింది. కేంద్రం ఇచ్చే నిధులను నేరుగా పంచాయతీ ఖాతాలకు జమ చేస్తామని, పల్లెలో ప్రగతి పనులు చేపటడతామని, పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం రెండో విడత ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేసింది. తాజాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మొదటి విడతగా పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలోని పంచాయతీలకు రూ.70.04 కోట్లు విడుదలయ్యాయి. పంచాయతీలకు అన్‌టైడ్ కింద రూ.28.21 కోట్లు, టైడ్ గ్రాంటు కింద రూ.41.82 కోట్లు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని జనాభా ప్రాతిపదికన పంచాయతీల ఖాతాల్లో నిధులు జమ చేశారు. వైసీపీ పాలనలో ఐదేళ్లలో లేని విధంగా పంచాయతీ లకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుండటంతో పంచాయతీల పాలకవర్గాలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాయి. నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఒకదాని వెంట విడుదల చేస్తుండటంతో గ్రామాల్లో సమస్యలు తీరనున్నాయి. టైడ్ నిధులను ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగు నీటి సరఫరా, రహదారులు వంటి పనులకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలి. ఇందుకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతిసారీ పంచాయతీల విద్యుత్ బకాయిలకు కొంత మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. అదే తరహాలో ఇప్పుడూ అన్‌టైడ్ గ్రాంటుగా విడుదల చేసిన రూ.28.21 కోట్లలో పది శాతం విద్యుత్ బకాయిలకు ఖచ్చితంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో పది శాతం నిధులను ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణకు, 20 శాతం నిధులను కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలు, కంప్యూటర్ల కొనుగోలు, స్టేషనరి ఇతర సామగ్రి కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించింది. పాఠశాల భవనాల మరమ్మతులు, తాగునీటి వసతి, ఆట స్థలాల అభివృద్ధి వంటి పనులకు ఖర్చు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

జిల్లాల వారీగా నిధులు విడుదల ఇలా..

జిల్లా	అన్‌టైడ్ నిధులు	టైడ్ నిధులు
పల్నాడు	12,31,45,384	18,47,18,101
బాపట్ల	9,34,29,265	14,01,43,899
గుంటూరు	6,55,92,007	9,83,88,023

ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా వేరే అవసరాలకు మళ్లించుకుంది. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామ స్వరాజ్యం.. అభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు కృషి చేస్తున్నారు. నిధులు విడుదల చేయడం హర్షణీయం.



-జాస్తి వీరాంజనేయులు, అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు

పారదర్శకతకు తావులేదు.. గత ప్రభుత్వంలో అంతటా పక్షపాతమే రాజ్యమేలింది... ఇళ్ల నమోదులో కూడా రాజకీయ సిఫారసులకే ప్రాధాన్యమివ్వడంతో ఎంతోమంది అర్హులు సంక్షేమ పథకాలకు దూరంగా ఉండిపోయారు. వలంటీర్లు ఇష్టారాజ్యంగా ఇళ్ల సంఖ్యతో క్లస్టర్లు ఏర్పాటు చేయడమే కాకుండా తమ బంధువులను, స్నేహితులను మ్యాపింగ్ చేయడం ద్వారా ఇళ్ల నమోదు అంతా కూడా అస్తవ్యస్తంగా తయారయింది. స్థానికంగా నివాసం ఉండకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఇళ్లను సైతం మ్యాపింగ్ చేసి ఎంతోమంది అనర్హులకు గత ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది. వీటన్నింటిని సరిదిద్ది అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడడానికి ఇళ్లకు జియో ట్యాగింగ్ చేసే ప్రక్రియకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. జిల్లాలో ఇప్పటికీ దాదాపు 72 శాతం ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తి కాగా ఈనెల 25 నాటికి వందశాతం పూర్తి చేసే విధంగా యంత్రాంగం శ్రమిస్తోంది.

ఇక సంక్షేమం పక్కా...

● జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికి జియో ట్యాగింగ్

● విధుల నిర్వహణలో 3,500మంది సచివాలయ సిబ్బంది

● ఇప్పటికి 72శాతం పూర్తి.. ఈ నెల 25 తుది గడువు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రతి ఇంటిని జియో ట్యాగింగ్ పరిధిలోకి తేవాల్సిందేనని ప్రభుత్వం సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిచ్చింది. దీనిలో భాగంగా క్లస్టర్ల వారీగా ప్రతి ఇంటిని సచివాయల సిబ్బంది విజిట్ చేసి ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఇంటి నంబరు వివరాలకోసం ఫొటో తీసి యాప్‌లో నమోదు చేసిన తర్వాత కుటుంబసభ్యుల్లో ఒకరినుంచి ధ్రువీకరణ కోసం వేలిముద్ర లేదా ఫేస్ రికగ్నేషన్ తీసుకుంటున్నారు. సగటున ఒక్కో ఉద్యోగికి 90 నుంచి 110 ఇళ్ల వరకు కేటాయించి ప్రక్రియ చేపడుతున్నారు

మొత్తం ఇళ్ల సంఖ్యను 5,52,533

బాపట్ల జిల్లాలో ఉన్న మొత్తం ఇళ్ల సంఖ్యను 5,52,533గా అధికారులు తేల్చారు. వీటన్నింటిని జియో ట్యాగింగ్ పరిధిలోకి తేవడమే లక్ష్యంగా ఇంటింటికి సచివాలయ సిబ్బంది వెళ్లి ప్రక్రియ చేపడుతున్నారు. గురువారం నాటికి 3,95,100 ఇళ్లకు ట్యాగింగ్‌ను పూర్తి చేయగా 72 శాతం పూర్తి అయినట్లయింది. ఈ నెల 25 నాటికి వందశాతం పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఉన్న 477 సచివాలయాల పరిధిలోని 3,500 మంది సిబ్బంది దీనికి సంబంధించి విధులు నిర్వహిస్తున్నారు

సిబ్బందికి తప్పని పాట్లు...

ప్రస్తుతం జరుగుతున్న జియో ట్యాగింగ్‌ను గతంలో ఉన్న క్లస్టర్ల ఆధారంగానే చేపడుతుండడంతో క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు విధుల్లో ఉన్న సచివాలయ సిబ్బందకి ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గతంలో ఈ మ్యాపింగ్ మొత్తం ఓ ప్రహసనాన్ని తలపించే విధంగా వలంటీర్లు చేపట్టారు. వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు తోడు రాజకీయ పైరవీలే ప్రామాణికంగా ఓ ప్రణాళిక లేకుండా చేపట్టడంతో ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. క్లస్టర్ మ్యాపింగ్ విషయంలో పక్కపక్క ఇళ్లను కాకుండా ఎక్కడో ఉన్న ఇళ్లను దానిలో కలపడం, స్థానికంగా నివాసం ఉండకుండా ఏళ్ల తరబడి ఊరు విడిచి వెళ్లిన వారి ఇళ్లను సైతం మ్యాపింగ్‌లో చూపెట్టడంతో ఇప్పుడు అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. వాస్తవానికి ఇళ్ల జియో ట్యాగింగ్‌కు తొలుత ప్రభుత్వం ఇచ్చిన గడువు ఈ నెల 20తోనే ముగిసింది. కానీ ఫీల్డ్ లెవెల్‌లో అనేక ఇబ్బందులు సచివాలయసిబ్బందికి ఎదురవుతుండడంతో గడువును ఈ నెల 25 వరకు పొడిగించారు

పలు చోట్ల అభ్యంతరం...

గత ప్రభుత్వం అవలంభించిన ప్రతీకార విధానాల వల్ల ప్రస్తుతం ఇంటింటి సర్వేలు అంటేనే ప్రజలు భయపడే పరిస్థితి తలెత్తింది. దీనికి తోడు ముందస్తుగా ఈ జియో ట్యాగింగ్‌పై ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పించకుండా నేరుగా సిబ్బందిని రంగంలోకి దించడంతో పలుచోట్ల వివరాలు ఇవ్వడానికి నిరాకరించే పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అంతే కాకుండా సంక్షేమ పథకాలలో కోత వేయడానికే ఈ జియో ట్యాగింగ్ చేపడుతున్నారనే దుష్ప్రచారాన్ని గ్రామాల్లోని వైసీపీ శ్రేణులు చేస్తుండడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు ఇంటిదగ్గర కుటుంబసభ్యులు అందుబాటులో లేకపోవడంతో ఒకటికి రెండు సార్లు తిరగాల్సి వస్తోందని, కొన్ని చోట్ల ఉద్దేశపూర్వకంగానే తమను చూసి ఇళ్లనుంచి బయటకు వెళుతున్నారని సిబ్బంది వాపోతున్నారు

ఆలస్యంగా మేల్కొన్న అధికారులు....

పారదర్శకత కోసమే ఈ జియో ట్యాగింగ్ చేపడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కొన్ని చోట్ల ప్రజలు సహకరించకపోవడంపై అధికారులు ఆలస్యంగా మేల్కొన్నారు. ముందుగానే ఈ విధానం వల్ల కలిగే మేలును ప్రజలకు వివరించి చెప్పడంలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారుల వైఫల్యం స్పష్టంగా కనబడింది. ప్రజల నుంచి నిరాకరణ వ్యక్తమవుతుండడంతో బాపట్ల మున్సిపాలిటీతో పాటు పలు చోట్ల జియో ట్యాగింగ్ ప్రక్రియకు ప్రజలు సహకరించాలని, ఇది పూర్తిగా ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత కోసమేననే ప్రకటనలను విడుదల చేశారు

తర్వాత దశ వడపోతే....

ఇటీవల జిల్లా వ్యాప్తంగా యంత్రాంగం చేపట్టిన పరిశీలనలో దాదాపు 2,600మంది అర్హత లేకపోయినా పింఛన్ అందుకుంటున్న విషయాన్ని అధికారులు గుర్తించారు. ఈ ఇళ్ల జియో ట్యాగింగ్ పూర్తి అయ్యాక గత ప్రభుత్వంలో ఎంతమంది అర్హత లేకుండా లబ్ధిపొందారనే అంశంపై అంచనాకు ప్రభుత్వం వచ్చే అవకాశముంది.



నిజాంపట్నంలో ఓ ఇంటికి జియో ట్యాగింగ్ ప్రక్రియ చేపడుతున్న సచివాలయ సిబ్బంది

వివరాలు 6లో

విద్యార్థి మృతిపై జడ్జి విచారణ

● పొన్నెకల్లు జడ్పీ పాఠశాల ఘటనపై లీగల్ సర్వీసెస్ దృష్టి

14న జాతీయ లోక్ అదాలత్

● అన్ని కోర్టుల్లోనూ నిర్వహణకు ఏర్పాట్లు

గుంటూరు - సికింద్రాబాద్ ఆర్ఆర్‌బీ స్పెషల్స్

పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం

24 నుంచి 29 వరకు నడపనున్న రైల్వే



ఔషధ నిరోధకతపై

ఆందోళన



8

● మొండికేస్తున్న సూక్ష్మజీవులు

● మందులూ ప్రభావం చూపడం లేదు

● 24వ తేదీ వరకు అవగాహన వారోత్సవాలు

మూడు నెలలైనా.. ఇబ్బంది లేదు

పింఛన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 7.59 లక్షల మందికి లబ్ధి



జీజీహెచ్‌లో మందులు అందక రోగుల అవస్థలు

- నెల రోజులకు ఇవ్వకుండా.. ఐదు రోజులకే సరిపెడుతున్న సిబ్బంది
- షిఫ్టుల వారీగా విధులు కేటాయించాలంటూ ఫార్మసిస్టుల గగ్గోలు

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌కి సంబంధించి గత సూపరింటెండెంట్ తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో రోగులకు అష్టకష్టాలు తప్పడం లేదు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి జీజీహెచ్ లో నెలకోసారి మందులు ఇస్తుంటారు. ఆయా మందుల కోసం సాధారణ రోగులతోపాటు వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు సైతం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఒక్క గుంటూరు జిల్లా నుంచే గాక పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు నెలవారీ ముందుల కోసం జీజీహెచ్‌కి వస్తుంటారు. అయితే ఇక్కడ ఆయా రోగులు ముందుగా ఓపీ నమోదు చేసుకొని తీసుకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తుంది. ఆ తర్వాత క్యూలైన్‌లో నిలిచి వైద్యునికి చూయించుకోవడం ఒక ప్రహసనంగా మారుతుంది. ఉదయం నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని చివరకు మందులు చీటీ తీసుకొని ఆయా వార్డుల వద్ద క్యూలైన్లో నిల్చుని ఉంటే అర్ధాంతరంగా మూసివేయడమో, లేదంటే ఫార్మాసిస్టులు సమయం ముగియడంతో వెళ్లిపోయారనో సమాధానం వస్తుంది. అదేమంటే కొత్త భవనంలో మందులు ఇస్తారని, అక్కడికి వెళ్లమని చెబుతున్నారు. పాత భవనం నుంచి రోగులు కొత్త భవనానికి వెళ్లాలంటే అది ఒక పెద్ద సమస్యగా ఉంది. రోగులు, వృద్ధులు, పిల్లలు, మహిళలు అయితే ఆటో మాట్లాడుకొని కొత్త బిల్డింగ్ వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే అక్కడ కేవలం ఐదు రోజులకే ముందులు ఇస్తున్నారు. మందులు తీసుకునే విషయంలో రోగులకు అనేక ఇబ్బందులు ఏర్పడడానికి గత సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ తీసుకున్న నిర్ణయమే కారణమని పలువురు రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నానాతంటాలు..

షిఫ్టుల వారీగా విధులు కేటాయించినట్లయితే ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు షిఫ్టుల సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. అయితే ఇక్కడ పాత భవనంలోని ఫార్మసిస్టులను షిఫ్టులతో సంబంధం లేకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విధులు నిర్వహించాలంటూ ఆదేశాలివ్వడంతో ఇక్కడ రోగులకు మందులు తీసుకునే విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం పాత భవనంలో ఓపీ ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుంది. ఆయా ఓపీలకు అనుబంధంగా మందులు ఇచ్చే 3,13, 10బి, 14బి, 21, 26, స్టోర్ ఇలా ఆయా వార్డుల్లో విధులు నిర్వహించే ఫార్మసిస్టులకు మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు భోజన విరామం ఉంటుంది. ఆ సమయంలో ఆయా మందులు ఇవ్వడం నిలిపివేస్తారు. అయితే ఓపీ చూపించుకుని మందులు రాయించుకున్న రోగులు ఆ సమయంలో మందులు ఇవ్వకపోతుండడంతో మూసివేశారని భావించి వెనుతిరిగి వెళ్తున్నారు. మరికొందరైతే కొత్త భవనంలోకి వెళ్లాలని సలహా ఇస్తుండడంతో రోగులు, వారి సహాయకులు అక్కడకు వెళ్లడానికి నానా తంటాలు పడు తున్నారు.

ఫార్మసిస్టులకు షిఫ్టుల వారీగా విధులు కేటాయిస్తే..

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, తిరిగి రెండు నుంచి రాత్రి 8 గంటల వరకు ఆయా కౌంటర్లను కొనసాగిస్తే దూర



ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది. ఇటు రోగులకు అటు ఫార్మసిస్టులకు ఇబ్బంది లేకుండా ఉండాలంటే పాత భవనంలో కూడా షిఫ్టుల వారీగా ఆయా మందులు ఇచ్చే కౌంటర్లను కొనసాగిస్తే ఉదయం నుంచి రాత్రి వరకు మందులు ఇచ్చే ఫార్మా వార్డులు తీసి ఉంటాయి. గతంలో మధ్యాహ్నం తర్వాత ఆయా ముందులు ఇచ్చే వార్డులన్నింటిని మూసివేసినప్పటికీ వాటన్నింటికీ సంబంధించి 13వ వార్డులో రాత్రి వరకు మందులు ఇస్తుండే వారని రోగులు చెబుతున్నారు. కనీసం ఆ విధంగా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు 13వ నంబరు వార్డులో అన్ని వార్డులకు సంబంధించిన మందులు అక్కడ అందుబాటులో ఉంచినా సరిపోతుందని వారు కోరుతున్నారు. ఇకనైనా జీజీహెచ్ సూపరింటెండెంట్ దీనిపై దృష్టి సారించి పాత భవనంలో ఫార్మసిస్టులకు షిఫ్టుల వారిగా విధులను కేటాయించి తద్వారా రోగులకు మందుల ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



అనంత విజయకు బెస్ట్ ఫిషర్ ఎంటర్‌ప్రైజర్ అవార్డు అందజేస్తున్న మత్స్య శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు,మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు

మత్స్యకార మహిళ అనంత విజయ్‌కు అవార్డు

బాపట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలంలో హేచరీ నిర్వహిస్తున్న ఏకైక ఫిషర్ ఉమెన్ అనంత విజయ్‌కు బెస్ట్ ఫిషర్ ఎంటర్ ప్రైజర్ అవార్డు లభించింది. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో అనంత విజయ్‌కు రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, మంత్రి కొల్లు రవీంద్రల చేతుల మీదగా ఈ అవార్డును అందజేశారు. దేశవ్యాప్తంగా 462 హెచరీలు ఉండగా మహిళ నిర్వహిస్తున్న హెచరీ బాపట్ల మండలంలో మాత్రమే ఉంది. ఆమె ప్రతిభను గుర్తించి అవార్డును అందజేశారు. దేశంలోనే మొదటిసారిగా అవార్డు అందుకున్న ఫిషర్‌ఉమెన్‌గా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో జాతీయ మత్స్యకార సంఘం సెక్రటరీ జనరల్ అనంత నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రథమస్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా ఎడ్లజత

సత్తా చాటిన గుంటూరు జిల్లా ఎడ్ల జత

- ముగిసిన ఎడ్ల బండలాగుడు పోటీలు

దుర్గి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలోని శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి వార్షిక మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్లబండలాగుడు పోటీలు ముగిశాయి. చివరి రోజైన గురువారం ఆరుపళ్ల విభాగం పోటీలు జరపగా, ఈ పోటీలను ఎంపీపీ యేచూరి సునీతాశంకర్, టీడీపీ సీనియర్ నేత లింగా రమేష్, జనసేన జిల్లా కార్యదర్శి పులిహరి, మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన మోదుగుల రామిరెడ్డి, కృష్ణకిషోర్‌రెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 4938 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా పొలడుగుకు చెందిన బీఎల్‌కే బుల్స్ శశాంక్ శ్రేయా, వెంకటగిరి, విజయ్ పవన్ కుమార్ ఎడ్ల జత 4638.10 అడుగులతో రెండోస్థానం, గుంటూరు జిల్లా పెదగొట్టిపాడుకు చెందిన జీఎల్‌ఆర్ బుల్స్ గరికపాటి లక్ష్మయ్యచౌదరి ఎడ్లజత 4500 అడుగులతో మూడోస్థానం, ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీనివాసరావు ఎడ్లజత 4277 .07 అడుగులతో నాలుగోస్థానం, పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన ఏటుకూరి శ్రీనివాసరావు ఎడ్లజత 4250 అడుగులతో ఐదోస్థానం, నంద్యాల జిల్లా బిల్లాలపురానికి చెందిన భుమ్మ గోవర్ధన్‌రెడ్డి ఎడ్లజత 4250 అడుగులతో ఆరోస్థానం, పల్నాడు జిల్లా గురజాలకు చెందిన అంజయ్య ఎడ్లజత 4240.07 అడుగులతో ఏడోస్థానం దక్కించుకున్నాయి. ఈ పోటీలకు వ్యాఖ్యాతలుగా గూడా శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు గుండాల వెంకటేశ్వర్లు, ఆకుల రామలక్ష్మణ, వంకమళ్ల కోటేశ్వరరావు, నాదెండ్ల శ్రీను, కటకం రామారావు, గోళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన చంద్రబాబు

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

తాడేపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎస్సీ వర్గీకరణ చేసింది నేనే.... చేయబోయేది నేనే అంటూ కంకణం కట్టుకున్న వ్యక్తి సీఎం చంద్రబాబు అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. గురువారం మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మంద కృష్ణ మాట్లాడుతూ వైసీపీలో సోదరి శ్రీదేవిని అవమానించారని, చంద్రబాబు హయాంలోనే మాదిగల ఉద్యమం పెద్దఎత్తున లేచిందని మాదిగలు బలపడ్డారని వ్యాఖ్యా నించారు. రిజర్వేషన్ ఫలాలు అన్ని వర్గాలకు అందాలని మాదిగ వర్గాలు అన్ని విధాలా వెనుకబడ్డాయని చెప్పారు. గత ఐదేళ్లలో ఏ కార్పొరేషన్‌కు నిధులు లేవని, వ్యాఖ్యానించారు. ఎస్సీలు ఏ పార్టీలో ఉన్నా వారిని అవమానిస్తే సహించేది లేదన్నారు. డీఎస్సీ నోటిఫికేష న్‌ను అతి తక్కువ



మంద కృష్ణమాదిగను సత్కరిస్తున్న ఉండవల్లి శ్రీదేవి

సమ యంలో రెండు నెలల్లో విడుదల చేయాలని డీఎస్సీ కమిషన్‌ను కోరామన్నారు. ప్రభుత్వాన్ని కూడా పెద్ద మనస్సు చేసుకుని సమయం తగ్గించాలని కోరతా మన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ వర్గీకరణ కోసం నిలబడిన వ్యక్తి మంద కృష్ణమాదిగ అని చెప్పారు. అనంతరం మందా కృష్ణమాదిగను ఆమె సత్కరించారు.

పంచాయతీ రాజ్ డీఈఈ పెన్షన్ నిలిపివేత

గుంటూరు సిటీ, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): గతంలో పల్నాడు జిల్లా రాజుపాలెం పంచాయతీ రాజ్ సబ్ డివిజనల్ డీఈఈగా పనిచేసిన ఎన్ వెంక టేశ్వరరెడ్డి పెన్షన్, గ్రాట్యుటీ చెల్లింపు పూర్తిగా నిలిపివేస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ కుమార్ ఉత్తర్వులు వెలువరించారు.వెంకటేశ్వరరెడ్డి 2009 రాజుపాలెంలో పనిచేస్తున్న సమయంలో లంచం తీసుకుంటూ ఏసీబీ కి పట్టుబడ్డారు.ఆయనపై వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో పెన్షన్, గ్రాట్యుటీ 100 శాతం నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది.

వాడవాడలా.. మద్యం

(5వ పేజీ తరువాయి)

బెల్ట్‌షాపులున్నాయి.

- పెదకాకాని మండలంలోని వెనిగండ్ల సుగాలికాలనీ, ఎరుకల కాలనీ, గోళ్లమూడి, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, కొప్పురావూరులో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు.
- మంగళగిరిలోని బాప్టిస్టుపేట, పాత మంగళగిరి, కుప్పు రావుకాలనీ, వీవర్స్ కాలనీతోపాటు మండల పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఎనీ టైం మద్యం లభిస్తోంది. తాడేపల్లి పరిధిలోని డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, నులకపేటలో బెల్ట్ షాపులున్నాయి. సీతానగరం ఘాట్ల వద్ద నిత్యం ఓపెన్ బార్ నడుస్తుంది. ఇక్కడ తెల్లవారుజామున 4 గంటల నుంచే మందుబాబులు ఫుల్‌గా తాగి గొడవలు పడుతుంటారు.



బాపట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికారిక మద్యం బాటిళ్లతో పట్టుబడిన వ్యక్తి (ఫైల్ ఫొటో)

- తాడికొండ గ్రామంలో చింతచెట్టు సెంటర్, పడమర వీధి రామాలయం, రావిచెట్టు సెంటర్, ఎస్సీ కాలనీలో, పొన్నెకల్లు బైపాస్‌లో మూడు షాపుల్లో, సత్రం సెంటర్, జడలం బావి సెంటర్‌లో, లాం, నిడుముక్కల, మోతడక, పాములపాడు, బండారుపల్లిలో మద్యాన్ని విక్రయిస్తున్నారు.
- కాకుమాను మండలంలోని కొమ్మూరు, రేటూరు, అప్పాపురం, గరికపాడు, బీకే పాలెం, చిన్నలింగాయపాలెం గ్రామాల్లో బెల్టు షాపులు నడుస్తున్నాయి. ఇటీవల కొమ్మూరులో బెల్టు షాపులను తొలగించాలని ఎమ్మెల్యే రామాంజనేయులకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.
- నరసరావుపేట నియోజకవర్గంలోని ఒకటి రెండు గ్రామాలు మినహా అన్ని పల్లెల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. రొంపిచర్ల మండలంలో మద్యం షాపులు నిర్వహకుల మధ్య పోటీ నెలకొనడంతో ఒక వర్గం అధికారం అండతో బెల్టు షాపులను గ్రామాల్లో నిర్వహిస్తోంది. వీరు తప్ప మరేవరు గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించకూడదని బెదిరిస్తుంది. నరసరావుపేట మండలంలో వ్యాపారులు సిండికేటై బెల్ట్ షాపులను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.
- చిలకలూరిపేటలోని శివారు కాలనీలతో పాటు యడ్లపాడు మండలంలో ప్రతి గ్రామంలోనూ బెల్టు షాప్‌లు ఉన్నాయి. సాతులూరు వంటి గ్రామాల్లో ఏడు నుంచి పది బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు.
- పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి, కరాలపాడు, గురజాల, మాచవరం, మోర్జంపాడు, అంబాపురం, పులిపాడు, దైద, జంగమహేశ్వరపురంలో బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. తెలంగాణ మద్యాన్ని కూడా కొందరు గుట్టుగా విక్రయిస్తున్నారు. కారంపూడిలో 3 మద్యం షాపుల నిర్వాహకులే పలు బడ్డీ బంకుల వద్ద మద్యం ఉంచి క్వార్టర్‌కు రూ.30 అదనంగా అమ్మిస్తున్నారు.
- రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం, తుమ్మకోట గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై కేసులు నమోదయ్యాయి. దుర్గి మండల పరిధిలో రెండు మద్యం దుకాణాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో యథేచ్ఛగా హైవే రోడ్డు పక్కన దాబాల్లో మద్యం విక్రయాలు సాగుతున్నాయి. కొందరు యువకులు మద్యం షాపుల్లో మద్యం కొనుగోలు చేసి నాగులేటి పరిసర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారు.
- బాపట్ల నియోజకవర్గ పరిధిలో ముత్తాయపాలెం, మద్దిబోయినవారిపాలెం, కనకాద్రి నగర్‌తో పాటు సూర్యలంక తీర ప్రాంతంలో అనధికార మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని చాలా గ్రామాల్లో వైసీపీ హయాంలో ఎవరైతే బెల్టు షాపులు నిర్వహించారో వారే ఇప్పుడు కూడా బెల్టు దందాను నడుపుతున్నారు.
- చీరాలలో సుదీర్ఘకాలంగా మద్యం వ్యాపారంలో ఉన్న ఓ టీడీపీ ద్వితీయశ్రేణి నేత బెల్టు షాపుల సిండికేట్ విషయంలో ఎడతెగని చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇక్కడ టీడీపీకి చెందిన వారితో పాటు వైసీపీకి చెందిన వారు కూడా దాదాపు 7 షాపులు దక్కించుకున్నారు. వారిని కూడా ఈ బెల్టు సిండికేట్‌లో భాగస్వామ్యం అయ్యే విధంగా సదరు నేతే పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 584.80 అడుగులు ఉంది. ఇది 296.85 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,200 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5438 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,151 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 47,489 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 47,489 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 39.93 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామన్నారు.

బాలుడు మృతిపై జడ్జి విచారణ

తాడికొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పొన్నెకల్లు జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న షేక్ సమీర్ మృతిపై డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ టి.లీలావతి గురువారం విచారణ జరిపారు. పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులను విచారించారు. బాలుడు మృతి చెందిన నేలబావిని పరిశీలించారు. సమీర్ గత అక్టోబర్ 24న నేలబావిలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. బాలుడు మృతి చెందిన రోజు బంధువులు ఫిర్యాదు చేయకపోవటంతోపాటు, పోస్టుమార్టం చేయటానికి మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించడాన్ని కూడా అడ్డుకున్నారు. దీంతో సమీర్ మృతదేహాన్ని సొంత గ్రామమైన కర్లపూడికి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే సమీర్ మృతిపై అనుమానాలు ఉండటంతో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. బాలుడు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో మంగళవారం బాలుడి మృతదేహాన్ని వెలికితీసి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

రైలు పట్టాలపై యువతి బలవన్మరణం

దాచేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయితీ నారాయణపురంలో నివాసముంటున్న గొల్లమందల అంజలి (21) నడికూడి రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు పట్టాలకు దగ్గరలో ఒంటిపై పెట్రోలు పోసుకొని మృతి చెందినట్లు దాచేపల్లి ఎస్ఐ పాపారావు గురువారం తెలిపారు. అంజలి వ్యక్తిగత కారణాలతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు వివరించారు. దాచేపల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి వివాహం కాలేదు. అంజలి నారాయణపురంలో నివాసముంటున్న శేషమ్మ మనుమరాలుగా గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిని దాటుతుండగా లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మరణించిన సంఘటన మండల పరిధిలోని యనమదల వద్ద గురువారం జరిగింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 సంవత్సరాల వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి జాతీయ రహదారి దాటుతుండగా గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న లారీ వేగంగా వస్తూ ఢీకొట్టింది. అతను అక్కడికక్కడే మరణించాడు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు - సికింద్రాబాద్ ఆర్ఆర్‌బీ స్పెషల్స్

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో జరిగే ఆర్ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం అన్-రిజర్వుడ్ స్పెషల్ ట్రైన్స్‌ని నడప నున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07171 గుంటూరు - సికింద్రాబాద్ ఆర్ఆర్‌బీ స్పెషల్ ట్రైన్ ఈ నెల 24, 25, 26, 28, 29 తేదీల్లో ఉదయం 8 గంటలకు బయలుదేరి మంగళగిరి, విజయవాడ, కాజీపేట మార్గంలో ప్రయాణించి సాయంత్రం 4.15కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. నంబరు. 07102 సికింద్రాబాద్ - గుంటూరు ఆర్ఆర్‌బీ స్పెషల్ ఈ నెల 24, 25, 26, 28, 29 తేదీల్లో సాయంత్రం 5.45కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. ఆర్ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ సదుపాయాన్ని వినియోగించు కోవాల్సిందిగా డీఆర్ఎం విజ్ఞప్తి చేశారు.

నేడు బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ ప్రమాణస్వీకారం

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్‌గా శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు టీడీపీ నేత నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. గుంటూరు సమీపంలోని నాగార్జున వర్సిటీ వద్ద రెయిన్‌ట్రీ పార్క్‌లోని బోర్డు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది.

14న జాతీయ లోక్ అదాలత్

గుంటూరు(లీగల్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థ సారధి తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో ఏర్పాటు చేయనున్న బెంచ్ ల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న కోర్టులలో భాగ పంపిణీ దావాలు, బాకీ వసూలు కోసం వేసిన దావాలు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, ఆస్తి కొనుగోళ్ల అమ్మకాలకు సంబంధించి అగ్రిమెంట్‌లపై వేసిన దావాలతోపాటు ఇతర సివిల్ దావాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన కేసుల్లో రాజీ పడదగ్గ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భూ సేకరణకు సంబంధించి పరిహారం కేసులతోపాటు కోర్టుల్లో కాకుండా నేరుగా జిల్లా న్యాయసేవాధికార సంస్థలో దాఖలైన ప్రీ-లిటిగేషన్ కేసులు రాజీ మార్గంలో పరిష్కరించనున్నామని పార్థసారధి చెప్పారు. కక్షిదారులు, పోలీస్ శాఖ, ప్రభుత్వాధికారులు, స్టేక్ హోల్డర్స్ అందరూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో ఎక్కువ కేసులు పరిష్కరించటానికి సహకరించాలని కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ముఖ్యంగా సివిల్ అప్పీళ్లు, చెక్కు బౌన్స్ కేసులు ఎక్కువగా రాజీ చేసే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు.

'ఆర్గానిక్' మోసంపై కేసు

గుంటూరు సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ ఎరువుల పేరిట పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రైతులను నిట్ట నిలువునా ముంచిన సంస్థపై చట్టపరమైన చర్యలకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్టార్ అగ్రి జెనిటిక్స్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. సంస్థకు చెందిన ఎరువుల నమూనాలు విఫలం కావడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సెప్టెంబరు 10 వ తేదీన గుంటూరు నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న వీఆర్ ఎల్ పార్సిల్లో వ్యవసాయ అధికారులు రూ. 13.68 లక్షల విలువ చేసే 6వేల కిలోల బరువు కలిగిన ఆర్గానిక్ ఎరువులను స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఉత్తరప్రదేశ్‌లోని స్టార్ అగ్రి జెనిటిక్స్ సంస్థ ఆర్గానిక్ ఎరువులను పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లి గూడెం తరలిస్తుండగా పార్సిల్ కార్యాలయంలో తనిఖీ చేపట్టిన ఇక్కడి వ్యవసాయ అధి కారులు స్వాధీనం చేసుకున్నారు. ఎరువుల నమూనాలను సేకరించిన అధికారులు పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్‌కు వెళ్లిన ఆరు నమూనాలు విఫలమైనట్లు తెలుస్తోంది. ఉప్పు స్వభావం కలిగిన ముడి పదార్థానికి రంగు వేసి ఎరువుగా చెలామణి చేస్తున్నట్లు పరీక్షల్లో తేలింది. ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా అధికారులు ఉత్తర ప్రదేశ్‌లోని స్టార్ అగ్రి జెనిటిక్స్ సంస్థపై పోలీసు కేసు నమోదు చేయించేందుకు సిద్ధమయ్యారు. పోలీసు విచారణలో సంస్థ అసలు రంగు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107.115.126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

44,282 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 46,017 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,282 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 37,373 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500	334	9000	13500
నెంబరు. 5	8000	11000	నెంబరు. 5	8000	11500
273	8000	12000	273	-	-
341	8000	15000	341	9000	14000
4884	-	-	4884	10000	11800
సూపర్ 10	-	-	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13800	బ్యాడిగి	8000	12500
దేవనూరు డీలక్స్	8500	14000	దేవనూరు డీలక్స్	11500	14500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	5000	10000

నేడు ఎస్టీల ప్రత్యేక గ్రీవెన్స్

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకట మురళి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ ప్రారంభమవుతుందన్నారు.

డీలర్ల నియామకానికి దరఖాస్తులు

చుండూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ దేవరకొండ నాగరాజు గురువారం తెలిపారు. మొత్తం 8 డీలర్ల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా, చుండూరు-2, (ఓసీ, ఈడబ్ల్యుఎస్), యడ్లపల్లి-1 ఓసీ, చినపరిమి-1, ఓసీ, పెనుగుదురుపాడు-1, ఎస్టీ కార్మూరు వారిపాలెం-1 ఓసీ, మోదుకూరు-1 ఓసీ, మండూరు-1 బీసీ డీలకు కేటాయించిన ట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ నెల 28 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు, అర్హత వివరాలను తహసీల్దార్ కార్యాలయం నుంచి పొందవచ్చని ఆయన తెలిపారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 24వ వార్డు డ్రైవర్స్ కాలనీలో డిజిటల్ లావాదేవీలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధి విక్రయదారులతో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సిటీ బ్యాంక్ మేనేజర్ శ్రీవిద్య ముఖ్యఅతిథిగా పాల్గొని ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించటం గురించి అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగియుండాలని చెప్పారు. వ్యాపారాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు గురించి మెప్మా సీవో విజయలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పింఛను పంపిణీ బకాయిల చెల్లింపునకు అనుమతులు జారీ

బాపట్లరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛనుపంపిణీలో బకాయిలు చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందని కలెక్టర్ జె.వెంకటమురళి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కారణంతోనైన లబ్ధిదారుడు పింఛను తీసుకోకుంటే వారిని పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. మూడునెలలుగా పింఛను అందుకోలేని వారికి ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తుందన్నారు. బకాయిల చెల్లింపు విధానం నవంబరు నుంచి అమల్లోకి వచ్చేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. డిసెంబరు 1వ తేదీ నుంచి పింఛను నగదు విడుదల చేస్తామన్నారు. ఆమేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మూడునెలల తర్వాత పింఛను తీసుకోలేకపోతే అలాంటి వారిని శాశ్వత వలసలు కింద పరిగణిస్తూ పింఛను నిలిచిపోతుందన్నారు. పింఛనుకు సంబంధించిన నగదు ప్రభుత్వానికి తిరిగి చెల్లించకుండా మండల, జిల్లా స్థాయిలో ఉన్న నగదును గుర్తించాలన్నారు. ఆ నిధుల నుంచి పింఛను లబ్ధిదారులకు బకాయిలు చెల్లించేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ఫించను బకాయిల చెల్లింపులకు ప్రభుత్వం అనుమతులిచ్చిన విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

ఉత్తమ ఉధ్యాయులకు సన్మానం



ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న నజ్మాఖాతూన్, ఉయ్యూరి వెంకటేశ్వరరావు

పిట్టలవానిపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చందోలు గ్రామ పంచాయతీ పరిధిలోని రసూల్‌పేటలోని మండలపరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు ఎండీ షాజాద్‌కు, నగరం మండలంలోని కట్టవ గ్రామానికి చెందిన మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న అబ్దుల్ రఖీబ్‌లకు పాఠశాల ప్రాంగణంలో సన్మానం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉర్దూ రేంజ్ బాపట్ల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నజ్మాఖాతూన్ అధ్యక్షత వహించారు. పిట్టలవానిపాలెం ఎంఈవోలు ఉయ్యూరి వెంకటేశ్వరరావు, కె.రాజారత్నంలు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు దక్కటం శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో పలువురు వక్తలు, చందోలు ఉర్దూ కాంప్లెక్స్ రీసోర్స్‌పర్సన్ ఎండీ అక్రమ్‌ఘోరి, ప్రధానోపాధ్యాయులు ఎండీ రహంతుల్లా, సయ్యద్ ఖాశీం, ఇమాముద్దీన్ ఖాదరి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి : ఎంపీడీవో

కర్లపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతనందాయపాలెం సచివాలయం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, కర్లపాలెం, బంగారురెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలను ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆరోగ్యకేంద్రాల సిబ్బందికి సూచించారు.

గర్భిణులకు పౌష్టికాహారం ఇవ్వాలి

కర్లపాలెం పంచాయతీ పాపిరెడ్డిపాలెం, బంగారురెడ్డిపాలెం అంగన్‌వాడీ సెంటర్లను ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం, బాలామృతం ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. సమయపాలన పాటిస్తూ విధులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎస్‌పీ అగ్రహారంలో ఉన్న శ్రీ గంగాపర్వత వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో గురువారం అభిషేకం అనంతరం గురుపుష్య యాగం నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

దగా పడుతున్న అన్నదాతలు

● వరి కోతలు ముమ్మరం
● 75 కిలోల బస్తా ధర రూ.1400ల లోపే



క్రాప వద్ద లారీకి లోడు చేసేందుకు సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు

కొల్లూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అహర్నిశలు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పండించిన పంటకు మద్దతు ధర లభించక అన్నదాతలు దగా పడుతున్నారు. ప్రస్తుతం 75 కిలోల ధాన్యం ధరలు రోజు రోజు కు వ్యాపారులు తగ్గించి వేస్తున్నారు. చేసేదేమీ లేక కోత కోసిన ధాన్యం నిల్వ చేసే సౌకర్యం లేక అన్నదాతలు వచ్చినకాడికి తెగనమ్ముకుంటున్నారు. మరో వైపు వాతావరణశాఖ హెచ్చరికలతో అన్నదాతలు రెండు మూడు రోజులుగా కొల్లూరు మండలంలో వరి కోతలను ముమ్మరం చేశారు. కోత కోయగా వచ్చిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసి తేమశాతం తగ్గిన వెంటనే దళారులతో ధాన్యం ధర కుదుర్చుకుని బస్తాల్లో నింపి లారీల్లో తరలిస్తున్నారు. వరికోతలు ప్రారంభ దశలో ఉన్నప్పుడు ధాన్యం ధరలు పతనం కావడంతో ముందు ముందు అన్ని ప్రాంతాల్లో వరికోతలు ముమ్మరం అయితే ధరలు మరింతగా పడిపోతాయనే భయం ఒక్క వైపు.. తక్కువ ధరకు అమ్మకుండా నిల్వ చేసినా తాము ఆశించిన ధర వస్తుందో రాదో తెలియక వ్యాపారులు, దళారులు అడిగిన ధరలకే ధాన్యం అమ్ముకుంటున్నారు. పైగా వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ధర కోసం పంటను కోయకుండా వదిలి వేస్తే అకాల వర్షాల వల్ల పంట నీటిపాలై పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. అందుకే రూపాయి అటు ఇటుగా చూసి విక్రయించుకుంటున్నారు. తాజాగా గురువారం 75 కిలోల దాన్యం బస్తా రూ.1350 వ్యాపారులు అడుగగా రైతులు అదే ధరకు విక్రయించినట్లుగా చెబుతున్నారు. సాగు వ్యయం పెరగడం, ప్రకృతి విపత్తులను ఎదుర్కొని పండించిన పంటకు మద్దతు ధర రాకపోవడంతో రైతులు మానసికంగా కుంగిపోతున్నారు.

తక్కువ ధరలకు విక్రయించవద్దంటున్న వ్యవసాయ శాఖ అధికారులు

ధాన్యాన్ని తక్కువ ధరలకు విక్రయించవద్దంటూ వ్యవసాయాధికారులు రైతుల వద్దకు వెళ్లి అవగాహన సదస్సు నిర్వహిస్తున్న రైతులు మాత్రం వారి మాటలను పట్టించుకోవడం లేదు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయిస్తామని రెండు మూడు రోజులుగా వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో వ్యవసాయశాఖ సరఫరా చేసిన పోస్టర్లను తీసుకు వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో అకాల వర్షాల నుంచి పంట దెబ్బతినకుండా కోత కోయించి వచ్చినకాడికి అమ్ముకోవడమే మంచిదని అధికారుల మాటలు వింటే పూర్తిగా నష్టపోతామని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కోత దశకు వచ్చిన వరి పంటను ఎక్కువ మంది రైతులు యంత్రాల సాయంతోనే కోత కోయిస్తున్నారు. గంట కోతకు రూ.3 వేలు యంత్రానికి ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. కూలీలతో కోయిస్తే ఎకరాకు రూ.6 వేల వరకు అవుతుందంటున్నారు. దీంతో రైతులు యంత్రాలతో కోత కోయించేందుకు మొగ్గు చూపుతున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు : ఆర్డీవో



పడమర బాపట్ల గ్రామపంచాయతీ పరిధిలో ఇసుక అక్రమంగా తవ్విన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఆర్డీవో, మైనింగ్ ఏడీ, డీఎస్పీ

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో పి.గ్లోరియా హెచ్చరించారు. పడమర బాపట్ల గ్రామపంచాయతీ పరిధిలో ఇసుక అక్రమంగా తవ్విన ప్రాంతాలను మైనింగ్ ఏడీ రాజేష్, డీఎస్పీ రామాంజనేయులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. ఇసుకను తవ్విన ప్రాంతాలను పరిశీలించి బుసక తీయాలన్న అనుమతులు తప్పనిసరి అని చెప్పారు. తవ్వకాలు జరిపిన ప్రాంతాలను గుర్తించి ఎంత పరిమాణంలో ఇసుక తీసింది పరిశీలించారు. ఈ సందర్భంగా మైనింగ్ ఏడీ రాజేష్ మాట్లాడుతూ గడిచిన మూడునెలల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 69 వాహనాలను అదుపులోకి తీసుకొని వారి దగ్గర రూ.10,15,724 అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గత ఏడాది మేనెల నుంచి ఈనెల నవంబరు వరకు వివిధ ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు జరిపే ప్రాంతాలను గుర్తించి 39 కేసులు నమోదు చేశామన్నారు. తవ్విన ఇసుకకు 10రెట్లు అదనంగా జరిమానా విధించామన్నారు. వీటికి సంబంధించి 9కోట్ల రూపాయలు అపరాధం విధించామన్నారు. సంబంధిత వ్యక్తులకు డిమాండ్ నోటీసులు పంపించామన్నారు. స్పందించని వారికి రెవెన్యూ రికవరి చట్టం కింద చర్యలు తీసుకునేందుకు నోటీసులు మరోసారి ఇచ్చామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమూడిలో తహసీల్దార్ పరిశీలన

రేపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం పెనుమూడి కృష్ణానది వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు జరపరాదని గ్రామస్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామస్థులతో మాట్లాడి ఎక్కడా ఇసుక అక్రమ తవ్వకాలు జరపరాదని గ్రామస్థులకు సూచించామని అన్నారు. పట్టణ సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వ మంజూరు చేసిన ఇసుక రీచ్‌ల నుంచే ఉచితంగా ఇసుకను తీసుకెళ్లాలని సూచించారు. ఇసుక తవ్వకాలు జరిపితే ఉపేక్షించేది లేదని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల ఆత్మహత్యలు నివారించాలి

భట్టిప్రోలు, (కొల్లూరు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికుల ఆత్మహత్యలు నివారించాలని జిల్లా చేనేత కార్మిక సంఘం కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భట్టిప్రోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సత్యసాయి జిల్లా పరిగి మండలం, పెద్దరెడ్డిపాలెం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు ఆదినారాయణ అప్పుల భారం తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. చేనేతపై వేసిన జీఎస్టీని రద్దు చేసి గతంలో ఉన్న రాయితీలను పునరుద్ధరించాలన్నారు. అదే విధంగా కార్మికులకు 50 శాతం రాయితీతో ముద్ర లోన్లు మంజూరు చేయాలన్నారు. అప్పుల భారంతో ఆత్మహత్యలకు పాల్పడే కార్మికుల కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన సీవిజిల్-2024 ఆపరేషన్

బాపట్లరూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మెరైన్ పోలీసు, సూర్యలంక పోలీసుస్టేషన్, ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే సీవిజిల్ -2024 ఆపరేషన్ గురువారంతో ముగిసిందని బాపట్ల డీఎస్పీ జీ రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాదేశిక జలాల సంరక్షణ, పటిష్ఠత, తీరప్రాంత భద్రత, రక్షణ, అభివృద్ధి అదే విధంగా చొరబాటుదారులు, వలసదారులు, తీవ్రవాదులు, ఉగ్రవాదులు తదితర అసాంఘిక శక్తులను భూభాగంలో ప్రవేశించకుండా నిరోధించడమే ఈఆపరేషన్ ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల రూరల్ సీఐ గంగాధరరావు, మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

భట్టిప్రోలు, (కొల్లూరు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆక స్మికంగా మరణించిన స్నేహితుడి కుటుంబాన్ని అతని స్నేహితులు ఆర్థిక చేయూత అందించారు. భట్టిప్రోలుకు చెందిన గుంటూరు దేవదాసు అనే వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందడం తో చిన్ననాటి స్నేహితులు మైత్రి అసోసియేషన్ తరఫున ప్రగాఢ సానుభూతి కుటుంబసభ్యులకు తెలియజేశారు. అత డి కుటుంబాన్ని ఆదుకునేందుకు వారి ఇద్దరి పిల్లలు విద్యాభ్యాసం కోసం అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష సేకరించి కుటుంబసభ్యులు అందజేశారు. అంతే గాకుండా భవిష్యత్తు అవసరాలకు కూడా సాయం అందిస్తామని కుటుంబానికి భరోసా ఇచ్చారు. వీరంతా స్థానిక పీఎం రావు జడ్పీహెచ్ఎస్ స్కూల్లో 1987-88లో కలిసి పదో తరగతి అభ్యసించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షురా లు ఉషారమణి, ఉపాధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి రమణ, కోశాధికారి వై విజయసారధి, సభ్యులు ఎ.సురేంద్ర, ఆరేపల్లి సుబ్బారావు, రజని, సలీం, శ్రీని వాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

● మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్



లంకేవానిదిబ్బ మత్స్యకార సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడిగా నియమితుడైన బాలకోటేశ్వరరావును అభినందిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. గురువారం మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా రేపల్లె మండలంలోని లంకేవానిదిబ్బ, గంగడిపాలెం సొసైటీ అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తీరప్రాంతంలో ఉన్న మత్స్యకారుల అభ్యున్నతి కోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ కృషి చేస్తున్నారన్నారు. ఇటీవల కొత్తపాలెంలో మత్స్యకారుల మినీ హార్బర్‌కు రూ.కోటి 20లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. అనంతరం లంకేవానిదిబ్బ మత్స్యకార సంఘం సొసైటీ అధ్యక్షుడిగా ఎంపికైన పోతాబత్తుల బాలకోటేశ్వరరావు, గంగడిపాలెం మత్స్యకార సంఘం సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన నాయుడు శివరామకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు కొపనాతి రాజశేఖర్, పంథాని మురళీధరరావు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును త్వరగా పూర్తి చేయాలి

రేపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పంచాయతీల వారీగా కేటాయించిన టార్గెట్‌ను త్వరగా పూర్తి చేయాలని అనగాని శివప్రసాద్ అన్నారు. గురువారం రేపల్లె రూరల్ మండలం టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సభ్యత్వ నమోదు మందకొడిగా సాగుతుందని ప్రతి పంచాయతీలోని యూనిట్‌క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ఆయా గ్రామాల్లో సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు మాట్లాడుతూ పంచాయతీల వారీగా ఆయా గ్రామాల్లో ఉన్న నాయకులు దృష్టి సారించి సభ్యత్వ నమోదును త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, పంథాని మురళీధరరావు, జీవీ నాగేశ్వరరావు, మోర్ల అంజయ్య, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో 'గణిత దర్పణం' ఆవిష్కరణ



గణిత దర్పణం ఆవిష్కరిస్తున్న ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు తదితరులు

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రముఖ గణిత శాస్త్రవేత్తల జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అంతర్జాతీయ స్థాయిలో గణితశాస్త్ర పరిశోధన రంగంలో నిరుపమాన ఖ్యాతిని సముపార్జించిన కొమరవోలు చంద్రశేఖరన్, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల గణితశాస్త్ర విభాగ అధ్యక్షుడు నాగళ్ళ ప్రభాకరరావుల జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాల గణితశాస్త్ర విభాగం వారు ముద్రించిన గణిత దర్పణం అనే ఒక ప్రత్యేక పరిశోధన సంచికను బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావులు అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తల జీవిత చరిత్రను కె.సునీత, రాజేశ్వరి, ఎస్‌వీ వాసవిలు తెలియజేశారు. గణితశాస్త్ర విభాగాధ్యక్షుడు కేవీఎల్ఎన్ ఆచార్యులు మాట్లాడుతూ గణితశాస్త్ర పరిశోధన రంగంలో కొమరవోలు అద్భుతమైన పరిశోధన ఫలాలను అందించారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నజీర్ మాట్లాడుతూ కళాశాలలో వివిధ హోదాల్లో అమూల్యమైన సేవలందించిన నాగళ్ళ ప్రభాకరరావును కొనియాడారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షుడు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రటరి కొమ్మినేని హరిపద్మప్రసాద్, కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చాక మాట మార్చడం సరికాదు

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, నవంబరు21 (ఆంధ్రజ్యోతి) : కూటమి నాయకులు అధికారంలోకి రాకముందు ఒకవిధంగా వచ్చిన తర్వాత మరోవిధంగా మాట్లాడటం సరికాదని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. పార్టీశ్రేణులతో కలిసి గురువారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రఘుపతి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పినవారే ఇప్పుడు పట్టించుకోకపోవటం సిగ్గుచేటు అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 10వేలు ఇస్తామని మాయమాటలు చెప్పి మోసం చేశారన్నారు. రాష్ట్రంలో 40శాతం ఓట్లు పొందిన వైఎస్ జగన్మోహనరెడ్డికి ప్రతిపక్షహోదా ఇవ్వకపోవటం సరికాదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ఘోర పరాజయం పొందినప్పటికి ప్రతిపక్ష హోదా ఇచ్చారని గుర్తు చేశారు. అసెంబ్లీ సమావేశాలు నిర్లిప్తంగా చర్చ లేకుండా జరుగుతున్నాయన్నారు. ఇష్టానుసారంగా మాట్లాడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అసెంబ్లీలో టూరిజం అభివృద్ధి గురించి మాట్లాడటం సంతోషదాయకమన్నారు. అయితే టూరిజం అభివృద్ధి చెందాలంటే తీరప్రాంతాల్లో ఉన్న హేచరీలు ఇతర ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో వైసీపీ స్థానిక నేతలు కాగిత సుధీర్‌బబు, కోకి రాఘవరెడ్డి, చినపోతుల హరిబాబు, గవిని కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జయప్రదం చేయాలి

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సూర్యలంక రోడ్డులో కోన ప్రభాకరరావు కళాక్షేత్రం నందు ఈనెల 28వ తేదిన గురువారం ఉదయం 8 గంటలకు ఉచిత సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు భావపురి భక్తబృందం కన్వీనర్ నెమలికంటి హనుమంతరావు తెలిపారు. కావున వ్రతాల్లో పాల్గొనేవారు ఈనెల 25వ తేదిలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వారికి 26వ తేదీన టోకెన్‌లు ఇస్తారన్నారు. కార్తీక మాసంలో నిర్వహించే ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

వార్డు ప్రజల సమస్యలు పరిష్కరించాలి

● మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి



వార్డు సచివాలయంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వార్డు ప్రజల సమస్యలను పరిష్కరించాలని రెండో సచివాలయం సిబ్బందిని కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆదేశించారు. సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయం దగ్గర ఉన్న ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని వారికి తాగు నీరు, పారిశుధ్యం విషయాల్లో ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రజారోగ్య, ఇంజనీరింగ్ విభాగాల అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించా రు. ఎస్‌సీపీఐ, గృహాల జియో ట్యాగింగ్ సర్వేను త్వర గా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జబ్బార్, అసిస్టెంట్ ఇంజనీర్ డి.ప్రసాద్, శానిటరి ఇన్‌స్పెక్టర్ కరుణ, మెప్మా సీఎంఎం సుబ్రహ్మణ్యం, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణానికి స్థలం కేటాయించాలి

● కలెక్టర్‌ను కోరిన ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాకు తలమానికంగా నిలిచేలా క్రీడాకారులందరికీ అందుబాటులో ఉండే విధంగా అన్ని వసతులతో గచ్చిబౌళి స్టేడియం లాంటి స్టేడియంను బాపట్లలో నిర్మించటానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ గురువారం కలెక్టర్ జె.వెంకటమురళిని కోరారు. స్టేడియం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ స్థల పరిశీలన చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీని పలువురు క్రీడాకారులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

● సాంఘిక సంక్షేమ సాధికారిత జిల్లా అధికారి జె.రాజాదెబోరా

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ సాధికారిత జిల్లా అధికారి జె.రాజాదెబోరా తెలిపారు. 2024 -2025 సంవత్సరానికి సంబంధించి రెన్యూవల్స్, నూతన ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేయువారు జ్ఞానభూమి కళాశాల లాగింగ్ నందు వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తారన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆమె కోరారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు పేరలి విద్యార్థులు



రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన పేరలి జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

కర్లపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు పేరలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.అపర్ణ తెలియజేశారు. మంగళగిరి మండలం పెనుమాక జడ్పీ హైస్కూల్లో ఈనెల 20న జరిగిన అండర్ -14, 17 బాలబాలికల విభాగంలో ఎస్‌జీఎఫ్ జిల్లా సెలక్షన్స్‌లో గుంటూరు జిల్లా జట్టుకు పేరలి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పి.వెంకట బ్రహ్మచరణ్‌రెడ్డి, పి.ఆంజనేయ షణ్ముఖరెడ్డి, ఎం నందగోపాల్‌రెడ్డి, జే షైనీ, ఎస్ వైష్ణవి, డీ స్రవంతి, ఎం వర్షిణిలు ఎంపికయ్యారని అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు త్వరలో తిరుపతి, గుంటూరు జిల్లాలో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17, 14 త్రోబాల్ పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు కె.తిరుపతిరావు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ దాసరి రత్నబాబు, సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు అభినందనలు తెలియజేశారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో హెడ్‌కానిస్టేబుల్ ప్రతిభ



హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్. నాగరాజును సత్కరిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్థాయిలో బాపట్ల స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ నాగరాజు సత్తా చాటారు. అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ తుషార్ డూడీ ఆయనను అభినందించి ఘనంగా సత్కరించారు. 40 సంవత్సరాలు పైబడిన విభాగం పోటీల్లో పాల్గొని షాట్‌పుట్‌లో స్వర్ణ, జావలిన్‌త్రోలో రజత పతకాలను సాధించినట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని న్యూకూచ్ బిహార్ స్టేడియంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీలు జరిగాయి. పోటీల్లో ఇండియా, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. బాపట్లజిల్లా నుంచి హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు. 2002 నుంచి పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరిన నాగరాజు ప్రస్తుతం చీరాల టూటౌన్ పరిధిలో ఎస్‌బీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ విధంగా పతకాలు సాధించిన నాగరాజును పలువురు అభినందించారు.

వైభవంగా జిల్లెళ్ళమూడి అమ్మవారి జయంతి వేడుకలు





శ్రీలలితకోటి పారాయణంను పఠిస్తున్న మహిళలు

ప్రత్యేక అలంకరణలో హైమావతిదేవి అమ్మవారు

బాపట్లరూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం జిల్లెళ్ళమూడిలో ఉన్న అమ్మసన్నిధానంలోని హైమావతీదేవి అమ్మవారు జయంతి వేడుకలను విశ్వజననీ పరిషత్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఎంతో వైభవంగా నిర్వహించారు. భక్తులకు అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. హైమావతీదేవి జయంతి సందర్భంగా అమ్మసన్నిధిలో శ్రీలలిత కోటిపారాయణం కార్యక్రమాన్ని నిర్వహించగా సుమారు 3వేల మందికిపైగా మహిళా భక్తులు పాల్గొని శ్రీలలిత కోటి పారాయణంను పఠించారు. జయంతి ఉత్సవాలకు వచ్చిన భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు



ప్రజారోగ్య సిబ్బంది కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న కమిషనర్ కె.సాంబశివరావు

రేపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ రేపల్లెగా పట్టణాన్ని తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. గురువారం పాతపట్నంలోని రాచూరు జమీందార్ కోటలో పురపాలక సంఘంలోని ప్రజారోగ్య సిబ్బంది కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో హోదాలు మరచి అందరూ ఒకేచోట చేరి ఆప్యాయంగా పలకరించుకుంటూ గడపటం మానసిక ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. అదే విధంగా విధి నిర్వహణలో రేపల్లె పట్టణాన్ని ఆరోగ్య పట్టణంగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషితో ముందుకు వెళదామని సూచించా రు. అనంతరం కార్తీక వనసమారాధనలో భాగంగా ఉసిరిచెట్ల వద్ద భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ టీకేవీ గుప్తా, శానిటరీ ఇన్‌స్పెక్టరు ఆకురాతి రామచంద్రరావు, అసోసియేషన్ నాయకులు, సీపీఐ నాయకులు గొట్టుముక్కల బాలాజీ, నాగాంజనేయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై బాధ్యతాయుతంగా ఉండాలి

● చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్వప్న ప్రియ

బాపట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలపై బాధ్యతాయుతంగా ఉండాలని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్వప్న ప్రియ తెలిపారు. బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గురువారం ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో బాలికలపై లైంగికదాడులు, బాల్యవివాహాలు గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి స్వప్నప్రియ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎక్కడైన బాలికలపై వేధింపులు, బాల్యవివాహాలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఆంజనేయప్రసాద్, మౌనిక, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్రంలో ఎక్కడికైనా ఇక్కడి నుంచే ఎగుమతి
- క్రమేపీ తగ్గుతోన్న విస్తీర్ణం
- ఆదుకోవాలంటున్న రైతులు

చింతలపూడిలో.. సంపెంగ సౌరభాలు



సంపెంగ చెట్టు గుబురు

పొన్నూరుటౌన్, నవంబరు21 : భారతీయ జీవన విధానంలో పుష్పాలకు ప్రత్యేక స్థానం ఉంది. అనేక రకాల పుష్ప జాతులను దేవతల పూజల కోసం శుభకార్యాలలోనూ మహిళల అలంకరణ కోసం వినియోగిస్తారు. వీటన్నిటిలో మగువులకు మల్లెలు అంటే ప్రీతి. గుబాలించే పరిమళం చూడచక్కని రూపం ఆకు సంపెంగ పూల విశిష్టత ప్రాంతాలను బట్టి సంపంగి, సంపెంగ, చంప, హరిచంప, ఆకుపచ్చ సంపెంగ, ఆకు సంపెంగ అంటూ చాల పేర్లతో ఈ పూలను పిలుస్తారు. దీని శాస్త్రీయ నామం ఆర్టబోట్రేస్ హెక్సాపెటలస్. ఈ చెట్టు మిగిలిన పూల మొక్కలకన్నా వైవిధ్యభరితంగా ఉంటుంది. నిగనిగలాడే ఆకులతో బూడిద రంగు కొమ్మలతో ఈ చెట్టు గుబురుగా ఎదుగుతుంది. సంపెంగ చెట్టు ఉందంటే ఆ ప్రాంతం అంతా సువాసన భరితంగా ఉంటుంది. పూలు వికసించినప్పుడే కాకుండా పువ్వు ఎండిపోయిన తర్వాత కూడా పరిమళాలు వెదజల్లుతుంది. మల్లెల తర్వాత సువాసనలు వెదజల్లే సంపెంగలు మగువల మనస్సు దోస్తాయి. సంపెంగ పూల వల్లన సువాసనలే కాకుండా సుంగధ లేపనాల తయారీ, ఔషధాల తయారీలోనూ ఉపయోగాలు ఉన్నాయి. వత్తిడిని తగ్గించే మందుల్లోనూ అనేక రుగ్మతులు తగ్గించే ఔషధాల తయారీకి ఈ సంపెంగలను వినియోగిస్తారు. ఈ సంపెంగల తోటల సాగుకు గుంటూరు జిల్లా పొన్నూరు మండలం చింతలపూడి గ్రామం చిరునామాగా మారింది. పూర్వీకుల నుంచి సంక్రమించిన సంపెంగల తోటలను సాగు చేస్తూ ఇక్కడి రైతు కుటుంబాలు జీవనాధారం పొందుతున్నాయి.



సంపెంగ పూలు

తగ్గుతున్న సాగు విస్తీరణం.....

సువాసనలు వెదజల్లే సంపెంగ పూల తోట సాగు క్లిష్టతరంగా ఉంటుంది. అందువల్లన సాగు విస్తీర్ణం తగ్గుతుంది. గతంలో పదుల ఎకరాల సంఖ్యలో ఉన్న సాగు క్రమేణ మూడు ఎకరాలకు తగ్గిపోయింది. ప్రధానంగా సాంప్రదాయ పద్ధతులో సంపెంగ తోటల సాగు ఉంటుంది. ఒక ఎకరానికి 100 చెట్ల వరకు పెంచుకునే వెసులుబాటు ఉంది. ప్రస్తుతం కడియం నర్సరీలో ఒక్కో చెట్టు రూ. 100కు విక్రయిస్తున్నారు. చెట్లు నాటటానికి ఎకరానికి రూ. 10 వేల వరకు ఖర్చు అవుతుంది. చెట్లు నాటిన తర్వాత పశువుల ఎరువు, డీఏపీ వంటి రసాయన ఎరువులు వినియోగిస్తే చెట్టు ఎత్తు పెరుగుతుంది. నాటిన రెండవ సంవత్సరం నుంచి చెట్ల నుంచి పూల దిగుబడి వస్తుంది. జీవిత కాలం పాటు ఈ చెట్టు నుంచి పూల దిగుబడి వస్తూనే ఉంటుంది. గుబురుగా పెరగటంతో పాటు ఎత్తు పెరగటం వల్లన పూల కోత కష్టతరంగా ఉంటుంది. ప్రతి 2, 3 సంవత్సరాల ఒక్క సారి గుబురుగా పెరిగిన చెట్ల కొమ్మలను కత్తిరించుకోవటం ద్వారా తిరిగి కొత్త కొమ్మలు పుట్టి పూల దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉంది. సువాసనలు వెదజలే సంపెంగ పూల చెట్టు గుబురు కింద విష సర్పాలు సంచరిస్తూ ఉంటాయి. విష సర్పాలకు భయపడి సంపెంగ సాగు వైపు దృష్టిసారించటం లేదనే వాదన ఉంది.

సంపెంగ తోట నుంచి సీజన్‌లో ఎకరానికి 6 వేల పూల దిగుబడి రోజుకు వస్తుంది. సంక్రాంతి పండుగ నెల నుంచి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెల వరకు సంపెంగ పూల సీజన్‌గా పిలుస్తుంటారు. ఈ సీ.జనలలో ఎకరానికి పది వేల పూల దిగుబడి రోజుకు వస్తుంది. మే నెల వేసవి వడగాల్పుల తీవ్రతతో పూల దిగుబడి క్రమేపి తగ్గి తొలకరి వర్షాల నాటికి పూర్తిగా తగ్గిపోతుంది. చెట్టు వద్ద వందపూలను రూ.150కి టోకుగా విక్రయిస్తున్నారు. అదే రిటైల్ మార్కెట్‌లో పువ్వు రూ.3నుంచి రూ.5వరకు విక్రయించి రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. అయితే సంపెంగపూలు చెట్టు నుంచి కోసిన తర్వాత ఈ పూలు ఒక్కరోజు మాత్రమే సువాసనలు వెదజల్లి తర్వాత క్రమేపి వాడిపోతాయి. నిల్వ ఉండని కారణంగా ఈ పూల సాగు క్రమేణా తగుతూవస్తుంది. శుభకార్యాలు జరిగే సమయంలో, పండుగలు విశేష పర్వదినాల సమయంలోనూ ఈ సంపెంగ పూలకు అత్యధిక డిమాండ్ ఉంటుంది. మిగిలిన రోజుల్లో రిటైల్‌గా ఆలయాలకు దుకాణాలకు విక్రయించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. సంపెంగ పూల సాగును ఉద్యాన శాఖ పరిధిలోకి తీసుకుని వచ్చి ప్రభుత్వం నుంచి ప్రోత్సహకం అందిస్తే సాగు విస్తీరణం మరింత పెంచటానికి అవకాశం ఉంటుందని చింతలపూడి ప్రాంత రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి....



రాష్ట్రంలో మరెక్కడ సాగు చేయని సంపెంగ తోటలు పొన్నూరు ప్రాంతానికే ప్రత్యేకం. ఈ పూల విక్రయాలు స్థానికంగానే జరుగుతున్నాయి. ఈ పూలకు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే మరింత సాగు విస్తీర్ణం పెరుగుతుంది. ఆయా ఆలయాల అధికారులు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తే దళారుల బాధ తగ్గుతుంది. ప్రభుత్వం సాగుకు ప్రోత్సాహం ఇవ్వాలి.

- నల్లూరి వీరయ్య చౌదరి, చింతలపూడి సంపెంగ సాగు రైతు

ఉద్యాన శాఖ పరిధిలోకి తీసుకురావాలి..



సంపెంగ సాగును ఉద్యానశాఖ పరిధిలోకి తెచ్చి రాయితీలు అందించాలి. ఉద్యాన శాఖ మిగిలిన పూలతోటల సాగుకు ఇచ్చిన ప్రోత్సాహకాలను సంపెంగల సాగుకు అందించాలి. మొక్కలను రాయితీపై సరఫరా చేయటమే కాకుండా సాగుకు అవసరమైన పెట్టుబడి సహాయం అందించటం ద్వారా సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుంది. అంతేకాకుండా సుగంధ తైలం తయారు చేసే పరిశ్రమలను ఏర్పాటు చేయాలి.

- నల్లూరి హరిబాబు, చింతలపూడి. పూల రైతు

డిజిటల్ అరెస్ట్ అంటే.. భయపడాల్సిన పనిలేదు

- అటువంటి కాల్స్ వస్తే సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి కాల్ చేస్తే చాలు
- ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ అరెస్ట్ అంటే ఎవరూ భయపడాల్సిన పని లేదని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేసారు. గురువారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. డిజిటల్ అరెస్ట్ అనేది కేవలం సైబర్ నేరగాళ్ళ మోసపూరిత బెదిరింపుగానే తీసుకోవాలి గానీ కంగారుపడాల్సిన పనిలేదన్నారు. ఎవరైనా మీకు సాధారణ (లేదా) ఆన్లైన్ యాప్స్ వాట్సాప్, టెలిగ్రామ్, స్కైప్ వంటి వాటి ద్వారా కాల్స్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నాం అంటే భయపడవద్దన్నారు. అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ మధ్యకాలంలో అత్యధికంగా సైబర్ నేరగాళ్లు "డిజిటల్ అరెస్ట్" పేరుతో ముంబై , ఢిల్లీ నగరాల నుండి పోలీస్, ఇన్కమ్ టాక్స్, సీబీఐ, ఎన్ఐఏ, ఏసీబీ తదితర శాఖల అధికారులుగా నటిస్తూ సాధారణ కాల్స్ (లేదా) వాట్సాప్, టెలిగ్రాం, స్కైప్ మొదలగు ఆన్లైన్ యాప్స్ ద్వారా నకిలీ ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. మాదకద్రవ్యాలు, మనీలాండరింగ్ కేసుల్లో వారి ప్రమేయం ఉన్నట్లు నమ్మించి, వారిని అరెస్టు చేస్తున్నామని బెదిరించి, అరెస్టు కాకుండా ఉండాలంటే అపరాధ రుసుము చెల్లించాలని బెదిరించి డబ్బు కాజేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు గుర్తు తెలియని వ్యక్తులు నుండి వచ్చే ఫోన్ కాల్స్ వీడియో కాల్స్‌కు స్పందించవద్దన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు తెలుసుకోవలసిన విషయాలు....

ప్రభుత్వ సంస్థలు వీడియో లేదా ఆడియో కాల్స్ లేదా మెసేజ్‌లు ద్వారా అరెస్టులు చేయవన్నారు. బ్యాంకులు, బ్యాంకింగ్ రంగ సంస్థలు ఏవి కూడా వ్యక్తిగత వివరాలు, ఓటీపీ లేదా బ్యాంకు వివరాలు ఎప్పుడూ అడగవన్నారు. ఎవరైనా ఆయా వివరాల కోసం ఫోన్ చేస్తే అది ఫేక్ కాల్‌గా గుర్తించి కట్ చేయాలన్నారు. ఆయా వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా, ధైర్యంగా ఉంటూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి డిజిటల్ అరెస్ట్ మోసాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు.

త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న శృంగేరి పీఠాధిపతి



కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న శృంగేరి శారదా పీఠం జగద్గురు శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి

నరసరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో వేంచేసియున్న త్రికోటేశ్వర స్వామిని శృంగేరి శారదా పీఠం జగద్గురు శ్రీవిధుశేఖరభారతీ మహాస్వామి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు జగద్గురు భారతీ మహాస్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి భారతీ మహాస్వామి స్వయంగా ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో కోటప్పకొండలో జగద్గురు శ్రీవిధుశేఖర భారతీ ఆధ్వర్యంలో కుంభాభిషేకం జరుగుతుందని అర్చకులు అప్పయ్యగురువులు తెలిపారు. నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ కొండపై బందోబస్తు ఏర్పాటు చేశారు.

- మొండికేస్తున్న సూక్ష్మజీవులు
- మందులూ ప్రభావం చూపడం లేదు
- 24వ తేదీ వరకు అవగాహన వారోత్సవాలు

ఆందోళన రేకెత్తిస్తున్న.. ఔషధ నిరోధకత!



గుంటూరు మెడికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): .యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఔషధ నిరోధకత/ఏఎంఆర్) తీవ ప్రజారోగ్య సమస్యగా పరిణమిస్తోంది. మనుష్యుల్లో జబ్బులకు కారణమయ్యే బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్, ఇతర పరాన్నజీవులు ఔధాలకు లొంగకపోవడమే ఏఎంఆర్. దీని వల్ల చిన్న ఇన్‌ఫెక్షన్లు కూడా మందులకు లొంగని విధంగా మొండిగా మారే ప్రమాదం ఉంటుంది. యాంటీ బయోటిక్ మందులు విచ్చలవిడిగా, అవసరం ఉన్నా, లేకున్నా వినియోగించడం ఔషధ నిరోధకతకు ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన గణాంకాల ప్రకారం..ఏటా ఔషధ నిరోధకత కారణంగా 50 లక్షల మంది మృతి చెందుతున్నారు. 2050 నాటికి ఈ సంఖ్య కోటికి చేరుతుందని అంచనా. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించి సమస్యను కట్టడి చేసేందుకు నవంబరు 18 నుంచి 24వ తేదీ వరకు 'వరల్డ్ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ వీక్' (వావ్) నిర్వహిస్తున్నారు. ఔషధ నిరోధకత వారోత్సవాల సందర్భంగా ఈ ఏడాది 'ఎడ్యుకేట్, అడ్వకేట్, యాక్ట్ నౌ అనే నినాదం ఇచ్చారు. ఏఎంఆర్ సమస్యపై ప్రజల దృష్టికి మరల్చేందుకు నీలి రంగును ఈ వారం రోజులు వైద్య సిబ్బంది నీలి రంగు దుస్తులు ధరించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కోరింది.

జిల్లాలో ర్యాలీలు...ప్రదర్శనలు

ఔషధ నిరోదకతకపై ప్రజల్లో, వైద్య సిబ్బందిలో అవగాహన పెంచేందుకు గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో పారా మెడికల్ సిబ్బంది, వైద్య విద్యార్థులతో పాటు సాధారణ రోగులు, వారి వెంట వచ్చే సహాయకులకు అవగాహన కల్పిస్తున్నారు. ఔషధ నిరోధకతపై ప్రజల్లో అవగాహన కోసం మెడికల్, ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థులు జిల్లాలో ర్యాలీలు, ప్రదర్శనలు చేస్తున్నారు. "అవసరం లేకున్నా రోగులకు యాంటీ బయోటిక్ మందులు సూచించవద్దని ఆర్ఎంపీ వైద్యులకు అవగాహన కల్పిస్తున్నామని" గుంటూరు వైద్య కళాశాల యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ నోడల్ అధికారి డాక్టర్ కే క్వీనాలీన తెలిపారు. ఏఎంఆర్‌పై మెడికల్ పీజీ, యూజీ విద్యార్థులకు క్విజ్, డిబేట్, పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

పలు మందులకు ఔషధ నిరోధకత....

న్యూఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ)కి అనుబంధంగా గుంటూరు వైద్య కళాశాల సూక్ష్మ జీవ శాస్త్ర విభాగంలో ఏఎంఆర్‌పై సర్వైలెన్స్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగుల రక్తం, మూత్రం, మలం, చర్మం, చీము, పలు ఇతర నమూనాలను పరీక్షించి వారి జబ్బుకు డ్రగ్ సెన్సిటివిటీని (ఏ మందు వాడితే సూక్ష్మజీవి నశిస్తుందో) తెలియజేస్తున్నారు. ఈ రిపోర్ట్ ఆధారంగా వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. నెలకు 500 నమూనాలు ఇక్కడ పరీక్షిస్తున్నారు. ఈ నమునాలకు కల్చర్ పరీక్షలు చేసి సూపర్ బగ్స్‌ను వేరు చేసి గుర్తిస్తున్నారు. రోగుల నమూనాలను నుంచి సూడోమోనాస్, ఎసింటోబ్యాక్టర్, క్లెప్సెల్లా, ఈకోలీ వంటి సూపర్ బగ్స్‌ను గుర్తించినట్లు మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ కే పరమేశ్వరి తెలిపారు. ఆయా సూపర్ బగ్స్..వ్యాంకోమైసిన్, కొలిస్టిన్, మెధిసిలీన్ వంటి యాంటీ బయోటిక్ మందులకు లొంగని విధంగా మొండిగా మారినట్లు ఆమె వెల్లడించారు.

సమాజానికి అన్యాయం చేయడమే

- డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, ఇన్‌ఫెక్షన్ వ్యాధుల వైద్యనిపుణులు



యాంటీ బయోటిక్ మందులను విచ్చలవిడిగా వాడటం సమాజానికి అన్యాయం చేసినట్లే. శరీరంలో 96 మంచి బ్యాక్టీరియాలు ఉంటే, కేవలం 4 చెడు బ్యాక్టీరియాలు ఉంటాయి. అవసరం లేకుండా యాంటీ బయోటిక్ మందులు వాడితే, అవి మంచి బ్యాక్టీరియాలను నాశనం చేస్తాయి. దీని వల్ల అనారోగ్యం బారిన పడతాం. ప్రాణాపాయ స్థితిలో ఐసీయూ వార్డుల్లో చేరే చాల మంది రోగుల్లో యాంటీ బయోటిక్ మందులు పనిచేయడం లేదు.

ప్రజల్లో అవగాహన పెరగాలి

- డాక్టర్ క్వీనాలీనా, ఏఎంఆర్ నోడల్ అధికారి, జీఎంసీ



యాంటీ బయోటిక్ మందులు రోగులు సొంత నిర్ణయంపై వాడకూడదు. ఈ విషయంలో ప్రజల్లో అవగాహన పెరగాలి. వైద్యులు కూడా తగిన వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరం అవసరమైతే యాంటీ బయోటిక్ మందులు రాయాలి. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ తీవ్రతను డాక్టర్లకు వైద్య విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు మైక్రోబయాలజీ విభాగం ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

మందులను తగిన విధంగా వాడాలి

- డాక్టర్ రేవూరి హరికృష్ణ, ఇన్‌ఫెక్షన్ వ్యాధుల వైద్యనిపుణులు



చాల జ్వరాలు వైరల్ ఫీవర్లు. వీటికి యాంటీ బయోటిక్ మందులు పని చేయవు. యాంటీ వైరల్ మందులు వాడాలి. కాని ఆర్ఎంపీలు, మెడికల్ షాపు దుకాణాల వారు జ్వరం అనగానే యాంటీ బయోటిక్ మందులు ఇస్తున్నారు. ఇది సరికాదు. ఈ విషయంలో రోగుల దృక్పథంలో మార్పు రావాలి. తగిన వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరం రోగుల అవసరం మేరకు ఈ మందులు వైద్యులు సూచిస్తారు.

ఆరోగ్య జీవనానికి క్రీడలు దోహదం

- డీఆర్ఎం కప్ - 2024 ప్రారంభోత్సవంలో కలెక్టర్ నాగలక్ష్మి



పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో డీఆర్ఎం కప్ - 2024 క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్, డీఆర్ఎం తదితరులు

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవితానికి క్రీడలు దోహదం చేస్తాయని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. గురువారం సాయంత్రం గుంటూరు పట్టాభిపురంలోని గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో 2వ డీఆర్ఎం కప్ - 2024 క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమం జరిగింది. క్రీడాకారులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించి పోటీలు ప్రారంభించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ, అనుబంధ శాఖల ఉద్యోగులు క్రీడలు ఆడటం వలన రోజు వారి పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. డివిజనల్ రైల్వే అధికారులు ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల టీంలతోనూ క్రీడా పోటీలు నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. ఇతర శాఖల టీంలతో పాల్గొనడం వల్ల క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడంతో పాటు టీం స్పిరిట్ పెంపొందించుకోవచ్చని, ఇతర శాఖలతో సత్సంసబంధాలు ఏర్పడతాయన్నారు. డీఆర్ఎం కప్‌క్రీడా పోటీలలో మహిళా ఉద్యోగుల టీంలకు అవకాశం కల్పించాలని సూచించారు. గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ మాట్లాడుతూ ఈడీఆర్ఎం కప్ క్రీడా పోటీల వలన రైల్వేలోని శాఖల మధ్య సమన్వయంపెంపొందించుటమే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, స్నేహభావాన్ని పెంపొందిస్తుందని తెలియజేశారు. డీఆర్ఎం కప్ - 2024 క్రీడా పోటీలలో డివిజన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నంద్యాల, తెలంగాణలోని యాదాద్రి భువనగిరి, నల్గొండ కలిపి మొత్తం ఏడు జిల్లాల పరిధిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్ క్రీడలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి డీఆర్ఎం కప్ పోటీల కంటే రెండవ విడతలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు మరింత మెరుగ్గా నిర్వహించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ సూచనల మేరకు మూడవ విడత నిర్వహించే డీఆర్ఎం కప్ - 2025 క్రీడా పోటీలలో మహిళ ఉద్యోగుల టీంలు పాల్గొనేలాఅవకాశం కల్పిస్తామన్నారు. సభ అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ రామకృష్ణ , రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ శివ హర్ష బాస్కెట్ బాల్ ఆడి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం సైమన్, సీపీఎం మనోహర్ రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ దినేష్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మూడు నెలలైనా.. ఇబ్బంది లేదు

- పెన్షన్‌దారులకు శుభవార్త
- మూడు నెలల వరకు బకాయిలు పొందవచ్చు
- ఆ తర్వాతా పునరుద్ధరణ కు అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 7.59 లక్షల మందికి ఉపయోగం

గుంటూరు సిటీ, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే రెండో నెలలో బకాయి సొమ్ము ఇచ్చేవాళ్ళు కాదు. వరుసగా మూడు నెలలు పెన్షన్ పొందకపోతే వాళ్లని లబ్ధిదారుల జాబితా నుండి శాశ్వతంగా తొలగించేవాళ్ళు. కుదిరీ కుదరక అలా పెన్షన్ సొమ్ము, పెన్షన్ పొందే అవ కాశం పోగొట్టుకున్న వాళ్ళు చాలామంది ఉన్నారు. ఇప్పుడు ఆ బాధ లేదు. పెన్షన్ దారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ తీసుకుంటున్న వాళ్ళ ప్రయోజనం ఎక్కడా దెబ్బ తినకుండా నిర్ణయం తీసుకుంది. ఒక నెల ,రెండు నెలలు వరకు కుదిరీ కుదరక పెన్షన్ తీసుకోక పోయినా హైరానా పడాల్సిన అవసరం లేదు. రెండు నెలల వరకు తీసుకోక పోయినా మూడో నెలలో మొత్తం బకాయిలు చెల్లించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నవంబర్ నుంచే ఈ విధానం అమల్లోకి వచ్చినట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలియజేశారు. వరుస గా మూడు నెలలు వరకు పెన్షన్ పొందని వారిని మాత్రమే శాశ్వత వలసగా పరిగణించి పెన్షన్ నిలిపి వేస్తారు.

శాశ్వత వలస దారులకు మళ్ళీ అవకాశం

గత ప్రభుత్వం రెండు, మూడు నెలలు పెన్షన్ తీసుకోకపోతే లబ్ధిదారుల ప్రయోజనానికి శాశ్వతంగా గండి కొట్టేది. కూటమి ప్రభుత్వం అటువంటి నిబంధన పూర్తిగా ఎత్తివేసింది. మూడు నెలల పాటు పెన్షన్ తీసుకొని వారిని శాశ్వత వలస దారులుగా గుర్తిస్తారు. వారి పెన్షన్ తాత్కాలికంగా నిలిపివేసినా తర్వాత పునరుద్ధరణకు అవకాశం కల్పించారు. వరుసగా మూడు నెలలు పెన్షన్ తీసుకోకుండా, శాశ్వత వలసదారులుగా పరిగణిస్తే, వారు మునిసిపల్ కమిషనర్, మండల అభివృద్ధి అధికారికి దరఖాస్తు చేసుకుంటే పెన్షన్ పునరుద్ధరిస్తారు.

ఉమ్మడి జిల్లాలో...

ప్రభుత్వం తీసుకున్న ప్రస్తుత నిర్ణయం వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లాలో ని 7,59,963 పెన్షన్ దారులకు మేలు జరుగుతుంది. గుంటూరు జిల్లాలో 2,55,258, పల్నాడు జిల్లాలో 2,75,070, బాపట్ల జిల్లాలో 2,29,635 మంది ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పొందుతున్నారు.

సౌత్‌జోన్ చెస్ పోటీలకు ఏఎన్‌యూ జట్లు ఎంపిక



సౌత్ జోన్ చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో సెలక్టర్లు

తాడికొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం చదరంగం పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు జట్ల మేనేజర్ ఏ.వీ.రాఘవయ్య తెలిపారు. లాం చలపతి ఫార్మసీ కళాశాలలో జరిగిన నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో వర్సిటీ జట్లను గురువారం ఎంపిక చేశారు. పురుషుల జట్టులో ఆర్‌వీఆర్‌జేసీ కాలేజ్ నుంచి కే.సాయి శ్రీకాంత్, ఎం.వంశీ, మహమ్మద్ ఇస్మాయిల్, బీ. గోవింద్, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల నుంచి జీ.జయప్రకాష్, పీ. గణేష్ ఎంపికయ్యారు. తమిళనాడులోని వెల్ టెక్ యూనివర్సిటీలో జనవరిలో జరిగే సౌత్ జోన్ పోటీలలో వీరు పాల్గొంటారు. మహిళల విభాగంలో జేకేసీ కళాశాల నుంచి ఎస్.వైష్ణవి, చలపతి ఫార్మసీ కళాశాల నుంచి బీ.సాయితేజ, ఆర్. నాగవైష్ణవి, కే. స్వప్నమాధురి, బాపట్ల కళాశాల నుంచి ఎల్ జాయిస్ మేరీ, సీహెచ్ అనూషాలు ఎంపికయ్యారన్నారు. వీరు విశాఖలోని గీతం యూనివర్సిటీలో డిసెంబరు 5న జరిగే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారు. జట్లకు మేనేజర్‌గా పీ.భానుప్రకాష్ వ్యవహరిస్తారు. కార్యక్రమంలో చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్‌ఆఫీసర్ తులసీరామ్, అద్దంకి ఈఈ ఎన్ మస్తానరావు

సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించండి

మార్టూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) :విద్యుత్ వినియోగదారులు సోలార్ విద్యుత్ కనెక్షన్‌లు ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించాలని, వారికి అవగాహన కలిగించాలని జిల్లా నోడల్ ఆఫీసర్ టీవీ తులసీరామ్ విద్యుత్ అధికారులకు సూచనలు చేశారు. గురువారం సాయంత్రం మార్టూరు సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ డీఈఈ కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద గృహ విద్యుత్ వినియోగదారులకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసే విషయంపై అధికారులతో సమావేశం జరిగింది. అద్దంకి ఈఈ నల్లూరి మస్తానరావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా తులసీరామ్ మాట్లాడారు. సోలార్ సిస్టమ్‌ను ఇళ్లపై ఏర్పాటు చేసుకుంటే వినియోగదారులకు డబ్బులు ఆదా అవుతాయని, అంతేగాకుండా వారి ఇంటికి సరిపడా విద్యుత్‌ను వారే తయారుచేసుకోవచ్చునన్నారు. కేంద్ర ప్రభుత్వం సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటుచేసుకున్న వినియోగదారునికి నెలరోజులకే సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో వినియోగదారులకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో మార్టూరు డీఈఈ సురేంద్రబాబు, యద్దనపూడి, సంతమాగులూరు, బల్లికురవ మండలాల ఏఈలు సురేష్ బాబు, దీపక్, శ్రీనివాసరావు, మార్టూరు జూనియర్ ఇంజనీర్ కిరణ్, కార్యాలయ జేఈ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లపై సౌరశక్తి యూనిట్‌ల ఏర్పాటుకు ప్రోత్సాహం

అద్దంకి : ఇళ్లపై సౌరశక్తి యూనిట్‌ల ఏర్పాటుకు పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నట్లు జిల్లా నోడల్ ఆఫీసర్ టీవీ తులసీరామ్ అన్నారు. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో గురువారం విద్యుత్‌శాఖ అధికారులు, సోలార్ వెండర్స్ తో అద్దంకి ప్రాంతంలో సోలార్ ఇన్‌స్టాలేషన్ కు సంబంధించి, భవిష్యత్ సమన్వయ ప్రణాళిక గురించి చర్చించారు. ఆసక్తి గల వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 1 కిలో వాట్‌కు రూ.30వేలు, 2 కిలోవాట్లకు రూ.60వేలు, 3 నుంచి 10కిలోవాట్లకు రూ.78వేల సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, డీఈ దామోదరం, ఏఈలు పాల్గొన్నారు.



అద్దంకి బ్రాంచి కెనాల్‌లో నీటి ప్రవాహం

ఏబీసీలో తగ్గిన నీటి ప్రవాహం

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచి కెనాల్ (ఏబీసీ)లో నీటి ప్రవాహం తగ్గింది. సాగర్ డ్యామ్ వద్ద పవర్ జనరేషన్ లో వచ్చిన సమస్యతో నీటి విడుదల తగ్గించడంతో అద్దంకి బ్రాంచి కెనాల్‌కు బుధవారం సాయంత్రం నుంచి నీటి విడుదల తగ్గించారు. పల్నాడు జిల్లా పరిధిలో ఇద్దరు బాలికలు ఏబీసీలో పడిపోవడంతో నీటి విడుదల మరింత తగ్గించినట్లు తెలుస్తుంది. గురువారం సాయంత్రం ఏబీసీ హెడ్ వద్ద 500 క్యూసెక్కులు మాత్రమే విడుదల అవుతున్నాయి. శుక్రవారానికి నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉంది. ఏబీసీ పరిధిలో అద్దంకి నియోజకవర్గంలో ఇటీవలనే వరినాట్లు అత్యధిక శాతం పూర్తి కాగా, మరికొన్ని చోట్ల కొంతమేర వరినాట్లు వేస్తున్నారు. అదే సమయంలో మొక్కజొన్న సాగుకు కూడా రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ పరిస్థితులలో నీటి విడుదలకు ఆటంకం ఏ ర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సాయంత్రానికి నీటి విడుదల జరిగినా చివరి ఆయకట్టుకు చేరే సరికి రెండు రోజుల పాటు పట్టే అవకాశం ఉందని, ఇప్పటికే సాగు చేసిన వరిలో కలుపు పెరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పల్లెపాలెంలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఏలూరికి టీడీపీ నేతల అభినందనలు

చినగంజాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విజనరీ లీడర్-2024 పురస్కారం పొందిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు పల్లెపాలెం టీడీపీ నాయకులు అభినందనలు తెలియజేశారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెంలో టీడీపీ సీనియర్ నాయకులు గొల్లపోతు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఏలూరి విజనరీ లీడర్ అవార్డు పొందిన సందర్భంగా గురువారం కేకు కట్ చేసి కార్యకర్తలు, మహిళలకు పంచిపెట్టారు. ఎమ్మెల్యే ఏలూరి అవార్డు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు దండ్రప్రోలు తిరుపతిరావు, గ్రామ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మత్స్యకార దినోత్సవంలో పాల్గొన్న మత్స్యకారులు

సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారం

వాడరేవు(చీరాలటౌన్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులు సం ఘటితంతో ఉంటేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మత్స్యకార సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో జాతీయ మత్స్యకార దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఓడ బలిజశాఖ, జాతీయ మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మత్స్యకార సంఘం నాయకులు మాట్లాడారు. మత్స్యకారులు మైక్రోస్కోప్, స్టెతస్కోప్ లేని రోజుల్లోనే నీటి ప్రవా హం, గాలి, వెలుతురు వంటి ప్రకృతి పరమైన ఆధారాలను గుర్తించి వేటను సాగించినట్లు వివరించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు సంతోష్, ఎరిపిల్లి రమణ, కనకరాజు పాల్గొన్నారు.

అనధికారక లేఅవుట్లకు అధికారుల అండ

నష్టపోతున్న కొనుగోలుదారులు
ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో అనధికారిక లేఅవుట్లు మూడు ఎకరాలు, అరవై ప్లాట్లు అన్నట్లు ముస్తాబవుతున్నాయి. అందుకు సంబంధిత రెవెన్యూ, పంచాయతీ అధికారులు అండగా నిలుస్తున్నారు. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ లేఅవుట్లు అందుకు నిదర్శనం. అందరికీ కనిపిస్తున్న అక్రమ లేఅవుట్లు అధికారులకు కనిపించకపోవడం విశేషం. ఈ క్రమంలో అంతిమంగా కొనుగోలుదారులు రూ.కోట్లలో నష్టపోతున్నారు. కొనుగోలు చేసినవారు నిర్మాణాలకు అనుమతిలేక అగచాట్లు పడుతున్నారు. సదరు స్థలాల్లో మౌలిక వసతులు కల్పన జరగదని తెలిసి ఆందోళన చెందున్నారు.

చీరాలకు చెందిన ఓ వైద్యుని తమ్ముడు వేటపాలెం మండలంలో ఓ అనధికారిక లేఅవుట్లో స్థలం కొనుగోలు చేశారు. తీరా అందులో నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు రావని అర్థమైంది. వసతుల కల్పన జరగదని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో అతను అక్కడ నిర్మాణం జరపలేనని ఆ స్థలాన్ని వేరే వారికి అమ్మేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన వారు వెయ్యి మందికి (క్రయ, విక్రయదారులతో కలిపి) పైగా ఉన్నారంటే ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు.

బాధ్యత మాది కాదు..

అనధికారిక లేఅవుట్లకు సంబంధించి రెవెన్యూ పంచాయతీ వారు బాధ్యత మాది కాదుగా అని ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు. ప్రాథమికంగా లేఅవుట్ వేయాలంటే ముందుగా రెవెన్యూ శాఖకు కన్వర్షన్ రుసుం చెల్లించాలి. తరువాత నిర్ణీత నిబంధనల మేరకు పంచాయతీ లేదా ఒడా నుంచి అనుమతి పొందాలి. అవేమీ లేకుండానే అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి.

ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం

ప్రస్తుతం వేస్తున్న, వేసిన లేఅవుట్లకు అధికారికంగా నాళా రుసుం చెల్లిస్తే కొన్ని కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జమ అవుతాయి. కానీ అది జరగడం లేదు.



పరిశీలించి చర్యలు చేపడతాం

నిబంధనలకు విరుద్ధంగా, పూర్తిస్థాయి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేయడం, విక్రయించడం సరికాదు. అందుకు తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. అక్రమ లేఅవుట్లకు సంబంధించి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

- రమేష్, పంచాయతీ కార్యదర్శి, కొత్తపేట



పెనాల్టీలు వేసి ప్రక్షాళన చేస్తాం

అనధికారిక లేఅవుట్లు చట్ట విరుద్ధం. వాటిని ఎవరు ప్రోత్సహించరు. అలాంటివి గుర్తించి నిబంధనల మేరకు పెనాల్టీలు వేస్తాం. అలా కొందరిపై చర్యలు చేపడితే వేరేవారు ఆ చర్యలకు పాల్పడరు. అందుకు అనుగుణంగా చర్యలు చేపడతాం.

- చంద్రశేఖర్ నాయుడు, ఆర్డీవో, చీరాల

స్వామి కార్యం పేరుతో స్వకార్యం

రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికారుల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి అందులో ఎలాంటి సందేహం లేదు. ఎక్కడికక్కడ వెలుస్తున్న అనధికారిక లేఅవుట్లే అందుక నిదర్శనం. అక్రమ లేఅవుట్లకు రాజకీయ అండ ఉందని చెప్తూ స్వామి కార్యం.. స్వకార్యం అన్నట్లు సంబంధిత అధికారులు చెప్పుకుంటూ లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



216 జాతీయ రహదారి పక్కన రోడ్డుమార్జిన్‌ను కలుపుకుని వేసిన అనధికారక లేఅవుట్

పెనాల్టీలు.. పీవోటీలే ప్రక్షాళన

అక్రమ లేఅవుట్లను ప్రోత్సహిస్తున్నది ఎవరు? నియంత్రణకు చర్యలు లేవా..?. ప్రస్తుతం జనాల్లో జరుగుతున్న చర్చ ఇది. నిబంధనల మేరకు అక్రమ లేఅవుట్లకు పెనాల్టీ (అపరాధ రుసుం) వేయడం, సదరు లేఅవుట్‌ను పీవోటీ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) జాబితాలో చేర్చడం సరైన పద్ధతనే విషయం తెలిసినవారు అంటున్నారు. అలా చేస్తే అక్రమ లేఅవుట్లకు చెక్ చెప్పవచ్చని భావిస్తున్నారు.

వాడవాడలా.. మద్యం

(5వ పేజీ తరువాయి)

బెల్ట్‌షాపులున్నాయి.

- పెదకాకాని మండలంలోని వెనిగండ్ల సుగాలి కాలనీ, ఎరుకలకాలనీ, గోళ్లమూడి, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, కొప్పురావూరులో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు.

- మంగళగిరిలోని బాప్టిస్టుపేట, పాతమంగళగిరి, కుప్పురావుకాలనీ, వీవర్స్ కాలనీతోపాటు మండల పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఎనీ టైం మద్యం లభిస్తోంది. తాడేపల్లి పరిధిలోని డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, నులకపేటలో బెల్ట్ షాపులున్నాయి. సీతానగరం ఘాట్ల వద్ద నిత్యం ఓపెన్ బార్ నడుస్తుంది. ఇక్కడ తెల్లవారుజామున 4 గంటల నుంచే మందుబాబులు ఫుల్‌గా తాగి గొడవలు పడుతుంటారు.

- తాడికొండ గ్రామంలో చింతచెట్టు సెంటర్, పడమర వీధి రామాలయం, రావిచెట్టు సెంటర్, ఎస్సీ కాలనీలో, పొన్నెకల్లు బైపాస్‌లో మూడు షాపుల్లో, సత్రం సెంటర్, జడలం బావి సెంటర్‌లో, లాం, నిడుముక్కల, మోతడక, పాములపాడు, బండారుపల్లిలో మద్యాన్ని విక్రయిస్తున్నారు.

- కాకుమాను మండలంలోని కొమ్మూరు, రేటూరు, అప్పాపురం, గరికపాడు, టీకే పాలెం, చిన్నలింగాయపాలెం గ్రామాల్లో బెల్టు షాపులు నడుస్తున్నాయి. ఇటీవల కొమ్మూరులో బెల్టు షాపులను తొలగించాలని ఎమ్మెల్యే రామాంజనేయులకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

- నరసరావుపేట నియోజకవర్గంలోని ఒకటి రెండు గ్రామాలు మినహా అన్ని పల్లెల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. రొంపిచర్ల మండలంలో మద్యం షాపులు నిర్వహకుల మధ్య పోటీ నెలకొనడంతో ఒక వర్గం అధికారం అండతో బెల్టు షాపులను గ్రామాల్లో నిర్వహిస్తోంది. వీరు తప్ప మరేవరు గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించకూడదని బెదిరిస్తుంది. నరసరావుపేట మండలంలో వ్యాపారులు సిండికేటై బెల్ట్ షాపులను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

- చిలకలూరిపేటలోని శివారు కాలనీలతోపాటు యడ్లపాడు మండలంలో ప్రతి గ్రామంలోనూ బెల్టు షాప్‌లు ఉన్నాయి. సాతులూరు వంటి గ్రామాల్లో ఏడు నుంచి పది బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు.

- పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి, కరాలపాడు, గురజాల, మాచవరం, మోర్జంపాడు, అంబాపురం, పులిపాడు, దైద, జంగమహేశ్వరపురంలో బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. తెలంగాణ మద్యాన్ని కూడా కొందరు గుట్టుగా విక్రయిస్తున్నారు. కారంపూడిలో 3 మద్యం షాపుల నిర్వాహకులే పలు బడ్డీ బంకుల వద్ద మద్యం ఉంచి క్వార్టర్‌కు రూ.30 అదనంగా అమ్మిస్తున్నారు.

- రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం, తుమ్మకోట గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై కేసులు నమోదయ్యాయి. దుర్గి మండల పరిధిలో రెండు మద్యం దుకాణాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో యథేచ్ఛగా హైవే రోడ్డు పక్కన దాబాల్లో మద్యం విక్రయాలు సాగుతున్నాయి. కొందరు యువకులు మద్యం షాపుల్లో మద్యం కొనుగోలు చేసి నాగులేటి పరిసర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారు.

- బాపట్ల నియోజకవర్గ పరిధిలో ముత్తాయపాలెం, మద్దిబోయినవారిపాలెం, కనకాద్రి నగర్‌తో పాటు సూర్యలంక తీర ప్రాంతంలో అనధికార మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని చాలా గ్రామాల్లో వైసీపీ హయాంలో ఎవరైతే బెల్టు షాపులు నిర్వహించారో వారే ఇప్పుడు కూడా బెల్టు దందాను నడుపుతున్నారు.

- చీరాలలో సుదీర్ఘకాలంగా మద్యం వ్యాపారంలో ఉన్న ఓ టీడీపీ ద్వితీయశ్రేణి నేత బెల్టు షాపుల సిండికేట్ విషయంలో ఎడతెగని చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇక్కడ టీడీపీకి చెందిన వారితో పాటు వైసీపీకి చెందిన వారు కూడా దాదాపు 7 షాపులు దక్కించుకున్నారు. వారిని కూడా ఈ బెల్టు సిండికేట్‌లో భాగస్వామ్యం అయ్యే విధంగా సదరు నేతే పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.



గోల్డ్ షాపుల యజమానులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణయ్య

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో దొంగలను గుర్తించే వీలుగా గోల్డ్ షాపుల యజమానులు ఆయా ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ కృష్ణయ్య అన్నారు. ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన అద్దంకి లో తగ్గిన డే, నైట్ బీట్‌లు అనే కథనానికి పోలీస్ అధికారులు స్పందించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గోల్డ్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. చోరీలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. రద్దీగా ఉండే బ్యాంక్‌లు, ఆర్టీసీ బస్టాండ్, భవానీసెంటర్, శింగరకొండ దేవాలయం తదితర ప్రాంతాలలో గురువారం పోలీస్‌లు ప్రత్యేకంగా పరిశీలనలు చేశారు.



గృహసముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న శృంగేరి శారదా పీటం విదుశేఖర భారతి మహాస్వామి

అర్చకుల గృహ నిర్మాణానికి శంకుస్థాపన

● ముఖ్యఅతిథిగా పాల్గొన్న శృంగేరి శారదా పీఠాధిపతి

సంతమాగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి మండలంలోని మిన్నెకల్లు గ్రామంలో గురువారం పర్యటించారు. మిన్నేకల్లు గ్రామంలో తంగిరాల అనంత లక్ష్మమ్మ స్మారక కల్యాణ మండపంలో అర్చక గృహాలకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో కల్యాణ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం శ్రీ విదుశేఖర భారతి చేతుల మీదుగా అర్చకుల గృహాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కల్యాణ మండపం ఇన్‌చార్జి, మార్కెటింగ్ యార్డు మాజీ చైర్మన్ బొల్లినేని రామకృష్ణ, సీఈవో పీఏ మురళి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

» జడ్పీ సీఈవో చిరంజీవి

దర్శి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జడ్పీ, మండల పరిషత్ ద్వారా చేపట్టిన పనులు వేగవంతం చేయాలని జడ్పీ సీ ఈవో చిరంజీవి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజ కవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవోలతో గురువారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు, జమా ఖర్చుల వివరాలు వెంటనే తెలపాలని ఆదేశించారు. స్వర్ణ పంచాయతీ, హౌస్‌హోల్డ్ జియో సర్వే, ఎస్‌పీసీఐ మ్యాపింగ్ కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పలుచోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వస్తు న్నాయన్నారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో దర్శి, కురిచేడు, తాళ్ళూరు, దొనకొండ, ముండ్లమూరు ఎంపీడీవోలు ఎల్ .కృష్ణమూర్తి, సతీష్‌బాబు, సుందరరామయ్య, శ్రీదేవి, జనార్దన్, దర్శి ఈవోఆర్డీ ఆవుల సుధాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో చిరంజీవి

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

దర్శి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 30 మంది బాధితులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు గురువా రం సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఒక వ్యక్తికి ఆపరేషన్ నిమిత్తం సీఎం మంజూరు చేసిన రూ.10 లక్షల చెక్కును అందజేశారు. మరో 30 మందికి రూ.26,41,131 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడు తూ ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదప్రజల సహాయార్థం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహృదయంతో బాధితుల కోసం సహాయ నిధులు విడుదల చేయటం ఆనందదాయకమన్నారు. కూటమి ప్రభుత్వం అందించిన ఈ సహాయనిధి ద్వారా సుమారు 30 మంది జీవితాలు నిలబడుతున్నాయన్నారు.

కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు మండలాల టీడీపీ అధ్యక్షులు నాగులపాటి శివ కోటేశ్వరరావు, పిడతల నెలమలయ్య, కూరపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన వారిని శిక్షించాలి

● ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకుల డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో లా చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శి క్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా గుడి సమీపంలోని ప్రకాశంపంతులు విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కరువైందని ఆరోపించారు. కలకత్తా ట్రైనీ డాక్టర్ ఘట న మరవకముందే లావిద్యార్థినిపై ఇటువంటి దాడి జరగడం దారుణంగా ఉందన్నారు. ఇటువంటి లైంగి క దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండి వీరస్వామి, మాలతి, నాగూర్, ఆదిలక్ష్మి, గోవిందమ్మ, పెద్దగోవింద మ్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, విద్యార్థినులు

అండర్‌పాస్ బ్రిడ్జి మంజూరుపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ఎన్.అగ్రహారం రైల్వే గేటు వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిని మంజూరు చేయించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని గురువారం ఘనంగా సత్కరించారు స్థానిక మాగుంట కార్యాలయంలో 16వ డివిజన్‌కు చెందిన ప్రజాప్రతిని ధులు, ప్రజలు ఎంపీ మాగుంటను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో స న్మానించారు. ఎన్నో ఏళ్ళుగా కలగా ఉన్న అండర్‌పాసు బ్రిడ్జి నిర్మాణానికి చ ర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అ మర నాగభూషణం, డివిజన్ అధ్యక్షుడు ఉంగరాల రవణయ్య, నాయకులు గొల్లపూడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మాదాశి చంద్ర, ఆల్లూరి హరి, కూనంశెట్టి చక్రవర్తి, దావూరి శ్రీనివాసరావు, శశి, ఏకాంబరం, సాయి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఒడిశా కార్మికులకు గాయాలు

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్కూటీ అదుపుతప్పిన ప్రమాదంలో ఇద్దరు ఒడిశా కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి మండలంలోని కుంకుపాడు సమీపంలోని స్పిన్నింగ్ మిల్‌లో పనిచేసే ఇద్దరు ఒడిశా కార్మికులు సంపత్, మరో వ్యక్తి గురువారం మధ్యాహ్నం అద్దంకి నుంచి శింగరకొండ వైపు వెళ్తూ 99 అడుగుల అభయాంజనేయస్వామి దేవాలయం సమీపంలో స్కూటీ అదుపు తప్పి నామ్ రోడ్డు పై పడి పోయారు. తీవ్రగాయాలైన సంపత్, మరో యువకుడుని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

మద్యం అక్రమ విక్రయదారుడి అరెస్ట్

చీరాలటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం నిల్వచేసి విక్రయిస్తున్న వాడరేవుకు చెందిన వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం మండల పరిధిలోని పలుచోట్ల దాడులు నిర్వహించారు. ముగ్గురు పాత నేరస్థులను తహసీల్దార్ గోపీకృష్ణ వద్ద బైండోవర్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు.

ఆటోలో వదిలిన లగేజీ బ్యాగ్ గుర్తించి బాధితులకు అప్పగించిన పోలీసులు

చీరాలటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నుంచి చీరాల్లోని బంధువుల ఇంటికి వచ్చిన దంపతులు తిరిగి వెళ్లే సమయంలో ఆటోలో లగేజీ బ్యాగ్‌ను మరిచి వెళ్లిన ఘటన గురువారం రాత్రి చీరాల టూటౌన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగభూషణం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన దంపతులు దాసరి లక్ష్మీ మృదుల, పవన్ ప్రసాద్ బుధవారం రాత్రి చీరాల కొత్తపేటలోని బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వెళ్లి ఫ్రెష్ అయ్యేందుకు రూంకు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. లగేజీని మరిచి ఇంటికి వెళ్లారు. వెంటనే విషయాన్ని గ్రహించి టూటౌన్ సీఐ నాగభూషణంకు ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ గంటల వ్యవధిలో పందిళ్లపల్లికి చెందిన ఆటోను గుర్తించారు. డ్రైవర్ గిరికు ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే అతను లగేజీని పోలీసులకు అప్పగించారు. బ్యాగులో 8 గ్రాముల బంగారం, రూ.6 వేలు నగదు దుస్తులున్నట్లు బాధితులు చూసుకోగా సీఐ వారికి అప్పగించారు.

బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు



మద్యం దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణదారులు బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం సర్కిల్ పరిధిలో పలు మద్యం దుకాణాలను సిబ్బందితో కలసి సీఐ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ బెల్ట్ షాపులను ప్రోత్సహించినా, మద్యం అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన స్క్వాడ్ ఇప్పటి వరకు రెండు కేసులు నమోదు చేశారన్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న 24 దుకాణాలకు సంబంధించి నిబంధనల మేరకు చేపట్టాల్సిన చర్యలు పూర్తయ్యాయన్నారు. ఇకపై ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన స్క్వాడ్ లేదా స్థానికంగా తాము ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. దుకాణదారులకు పలు హెచ్చరికలు, సూచనలు చేశారు.

నేడు విద్యుత్ కోత

మార్టూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ మండలాల్లో విద్యుత్ కోత విధించినట్లు డీఈఈ సురేంద్రబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంత్యక్రియలకు అవస్థలు

- చిట్టడవులను తలపిస్తున్న మరు భూమి స్థలాలు
- శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని ప్రజల విజ్ఞప్తి





1. వైదనలో చిల్ల చెట్ల మధ్య కనుమరుగైన హిందూ శ్మశానవాటిక
2. దారి మూసుకుపోయి ఉన్న అంబడిపూడి శ్మశానవాటిక
3. ముక్తేశ్వరంలో అభివృద్ధికి నోచుకోని వాటిక

బల్లికురవ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అంతిమ సంస్కారానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాలలో మరుభూముల స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. దీంతో గ్రామాలలో ఎవరైనా మరణిస్తే వారి అంత్యక్రియలకు బంధువులు పడరాని పాట్లు పడుతున్నారు. కనీసం దారి కూడా లేకపోవడంతో కొందరు యంత్రాలను తీసుకు వచ్చి లోపలికి వెళ్లేందుకు దారిని ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో ఉపాధి హామీ పథకం ద్వారా శ్మశాన వాటికలను అభివృద్ధి పరిచారని, ఆ తర్వాత వైసీపీ వచ్చాక శ్మశానవాటికలు అడవుల్లా తయారయ్యాయని ప్రజలు వాపోతున్నారు.

బల్లికురవ మండలంలోని అంబడిపూడి హిందూ శ్మశాన వాటిక పూర్తిగా అడవిలా మారింది. కనీసం దారి కూడా లేకపోవడంతో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు చేయాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తుమ్మ చెట్లు పెరగడంతో లోపలికి వెళ్లే వీలు లేక ప్రజలు మృతదేహాలను యంత్రాల ద్వారా లోపలికి తీసుకు వెళ్లి దహన సంస్కారాలను పూర్తి చేస్తున్నారు. అలానే ముక్తేశ్వరం గ్రామంలో శ్మశానవాటిక చుట్టూ తుమ్మపొదలు అలుముకున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన రూములు సైతం శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైదన గ్రామంలో శ్మశాన స్థలం కనుమరుగు అయిందని ప్రజలు వాపోతున్నారు. పిచ్చి చెట్లు, చిల్ల చెట్లు పెరిగడంతో అంత్యక్రియలు సాహసంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. గుంటుపల్లి, కొప్పెరపాలెం, చెన్నుపల్లి, కొండాయపాలెం, కొప్పెరపాడు, కూకట్లపల్లి, కొత్తూరు, వెలమవారిపాలెం, ఉప్పుమాగులూరు, కొణిదెన తదితర గ్రామాల్లోని శ్మశానవాటికలూ అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2016లో పలు గ్రామాలలో శ్మశానవాటికలను అభివృద్ధి చేశారని, ఆ తర్వాత పట్టించుకునేవారే లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం శ్మశానవాటికలను తక్షణమే అభివృద్ధి చేసి, వసతులు కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



అంబడిపూడిలో చిట్టడవిని తలపిస్తున్న శ్మశానవాటిక



భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

భూమిని పరిశీలించిన ఆర్డీవో

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేణంగివరంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు గురువారం భూమిని పరిశీలన చేశారు. గ్రామానికి చెందిన బి.పద్మజ సర్వే నెంబరు 103 - 6ఏ లో తనకున్న ఎకరం ముప్పై రెండున్నర సెంట్ల వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు ఆర్డీవోకు దరఖాస్తు చేశారు. ఆమె విజ్ఞప్తి మేరకు ఆ భూమిని ఆర్డీవో తహసీల్దార్ పీ సింగారావుతో కలసి పరిశీలించి, రికార్డులను చూశారు. వీరి వెంట వీఆర్వో సుమతి, సర్వేయర్ రాజా పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 5 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఆర్డీవో చొరవతో పట్టుకున్న తహసీల్దార్



ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్

వేటపాలెం(చీరాల), నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆదేశాల మేరకు గురువారం 5 ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ పార్వతి పట్టుకున్నారు. 216 జాతీయ రహదారిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. అందుకు సంబంధించి చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పార్వతిని ఆయన ఆదేశించారు. ఈ క్రమంలో తహసీల్దార్ పార్వతి ఆ ట్రాక్టర్ల యజమానులకు అపరాధ రుసుము విధించారు. మరో సారి పట్టుబడితే కేసులు తప్పవని హెచ్చరించారు.

డివైడర్‌లు అందంగా

చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



డివైడర్ వద్దను చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మార్టూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు సెంటర్‌లో సర్వీసు రోడ్డు పక్కన డివైడర్‌పై ఉన్న గడ్డిని, చెత్తా చెదారాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైవోవరకూ తూర్పువైపున సర్వీసు రోడ్డులో జడ్పీ హైస్కూల్ నుంచి రాజుగారిపాలెం రోడ్డు వరకు, పడమరవైపున శ్రీహర్షిణి విద్యా సంస్థల నుంచి విజయలక్ష్మి కల్యాణ మండపం వరకు రోడ్డు పక్కన డివైడర్‌లపై చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నారు. పెరిగిన గడ్డిని తొలగిస్తున్నారు. వాస్తవంగా హైవే అధికారుల ఆధ్వర్యంలో వారి సిబ్బంది ఈ పనులు చేయాల్సి ఉంది. కాని వారు పట్టించుకోకపోవడంతో పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్మికులు డివైడర్‌ను శుభ్రం చేశారు.



భూ వివాదంపై విచారణ జరుపుతున్న తహసీల్దార్ సింగారావు

భూ వివాదంపై తహసీల్దార్ విచారణ

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కశ్యాపురం గ్రామంలో తలెత్తిన భూ వివాదంపై తహసీల్దార్ పి.సింగారావు గురువారం విచారణ జరిపారు. గ్రామానికి చెందిన రైతు ధూళిపాళ్ల గంగయ్యకు సర్వే నెంబరు 748లో 5 ఎకరాల 93 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి విస్తీర్ణం విషయంలో తలెత్తిన సమస్యను పరిష్కరించాలంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు గంగయ్య దరఖాస్తు ఇచ్చారు. ఈ విషయమై తహసీల్దార్ సింగారావు ఆ భూమిని పరిశీలించారు. విస్తీర్ణ వ్యత్యాస విషయమై రైతులతో విచారించారు. తగు చర్యలు చేపడతామన్నారు. వీరి వెంట వీఆర్వో సుమతి, సర్వేయర్ రాజా పాల్గొన్నారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయండి

ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన అన్ని సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో స్వరూపారాణి సిబ్బందిని ఆదేశించారు. పంగులూరులోని సచివాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎపీఈడీవో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి. హాజరు నమోదు చేయాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించి నిల్వ ఉన్న స్టాక్‌ను తనిఖీ చేశారు. వీరివెంట ఈవోఆర్డీ కె.సుమంత్, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చీరాలటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని సంతబజార్‌లో గల శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి 99వ విగ్రహ ప్రతిష్ఠాపన వార్షికోత్సవాన్ని దేవస్థాన కమిటీ ప్రతినిధులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్థానిక ధ్యాన మండలి వారిచే భజన కార్యక్రమం, తరువాత కుంకుమార్చన, శాంతి హోమం, రాత్రి సమయంలో మహిళ భక్తులతో దీపోత్సవాన్ని వైశంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని కమిటీ ప్రతినిధులు గుంటూరు మాధవరావు, రాజా, నారాయణ, శేషారత్నం, పవన్, ధనలక్ష్మి, సీతా మహాలక్ష్మి, ప్రభాకరరావు పర్యవేక్షించారు.

అక్రమ లేఅవుట్లకు చెక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ప్రత్యేక కార్యాచరణ
- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమ లేఅవుట్లకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కార్యాచరణతో అడుగులు వేస్తున్నామని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో రియల్ వ్యాపారుల నయా దందా శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. అనధికారిక లేఅవుట్లతో కొనుగోలుదారులు నష్టపోకుండా తగిన చర్యలు చేపట్టేందుకు గత కొన్ని రోజులుగా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నామన్నారు. ప్రాథమికంగా కనీసం కన్వర్షన్ రుసుము కూడా చెల్లించకుండా అక్రమ లేఅవుట్లు వేసేవారిపై చట్టపరంగా చర్యలు చేపడతామన్నారు. అందులో భాగంగా నిబంధనల మేరకు అపరాధ రుసుము వసూలు చేస్తామన్నారు. తరువాత కూడా నిబంధనలను అనుసరించి మాత్రమే లేఅవుట్లు వేయాలన్న విషయాన్ని పక్కాగా చెప్తామన్నారు. కొనుగోలుదారులు అన్ని అనుమతులు ఉన్న లేఅవుట్లలో మాత్రమే స్థలాలు కొనుగోలు చేయాలన్నారు. సరైన సమాచారం తెలుసుకోకుండా అనధికారిక లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసి ఇబ్బందులకు గురికావద్దని, నష్టపోవద్దని కొనుగోలుదారులకు సూచించారు. అలానే ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై కూడా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అక్రమాలకు పాల్పడే ఎవరిని ఉపేక్షించమని స్పష్టం చేశారు. తొలిసారి పట్టుబడిన వారికి అపరాధ రుసుము, హెచ్చరికలతో వదిలేస్తామన్నారు. మరలా పట్టుబడితే కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. అనధికార లేఅవుట్లకు అధికారుల, సిబ్బంది ఎవరు సహకరించినా వారికి షోకాజ్ నోటీసులిచ్చి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో స్పష్టం చేశారు.

మండల స్థాయి విజేతలు

అద్దంకిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మండల స్థాయిలో పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో గంగాధరరావు తెలిపారు. ఈ పోటీలలో వ్యాసరచన పోటీలలో డి.సాయిశ్రీ (ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల), వక్తృత్వంలో ఏ.అమృత (జడ్పీహెచ్‌ఎస్ చక్రాయపాలెం), క్విజ్ పోటీలలో ఎం.సాయి సమీరా, (ప్ర భుత్వ బాలికల ఉన్నత పాఠశాల), డిబెట్‌లో ఎం.సాయి సమీరా, పి.లక్ష్మీదేవి, దేశభక్తి గీతాలు డి.మహశ్రీ (గురుకుల పాఠశాల, అద్దంకి) విజేతలుగా నిలిచారని తెలిపారు.

పోలేరమ్మ దేవాలయంలో అన్నదానం

అద్దంకి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని గురువారం అద్దంకి పట్టణంలోని పోలేరమ్మ దేవాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. సుమారు 2500 మందికి అన్నదానం చేశారు.



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సింగయ్య

పింఛన్‌కు దరఖాస్తులను స్వీకరించాలి

అద్దంకిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా పింఛన్‌ల కోసం దరఖాస్తులను స్వీకరించాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య తెలిపారు. గురువారం మండలంలోని శింగరకొండపాలెం సచివాలయంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పరిస్థితిని రికార్డుల ద్వారా పరిశీలించారు. ఎస్‌సీ కుటుంబాల రీ సర్వే వెరిఫికేషన్‌ను గురించి ఆరా తీశారు. నూతనంగా పింఛన్‌ల కోసం, గృహాల నిర్మాణం కోసం వచ్చే దరఖాస్తులను స్వీకరించాలని సిబ్బంది సూచించారు.

చెన్నకేశవస్వామికి శాంతి కల్యాణ మహోత్సవం

చినగంజాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారి వార్షిక శాంతి కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు జరిపారు. ఆలయ అర్చకులు నారాయణం సత్యబాబు, సారంగపాణి ఉత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలతో, పలు రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు దీవి హనుమత్ ప్రసాద్ మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా దంపతులతో నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తులు కనులరా తిలకించారు. ఈ ప్రాంగణం గోవింద నామస్మరణలతో మారుమోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. కార్యనిర్వహణాధికారి పోతిని శ్రీనివాసరావు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పర్చూరులో చెలరేగిన దొంగలు

- నాలుగు దుకాణాల్లో దొంగతనం
- సీసీ కెమెరాలో డీవీఆర్‌ను తొలగించి మరీ చోరీ
- క్లూస్ టీం ఆధారాల సేకరణ

పర్చూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో దొంగలు చెలరేగిపోయారు. వరుసగా నాలుగు దుకాణాల్లో షట్టర్లను తొలగించి దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. పర్చూ రు - చీరాల రోడ్డులోని ఆటోమొబైల్ షాపుతో పాటు, సమీపంలో ఉన్న చిల్లర దుకాణాల్లో చోరీకి పాల్పడిన దొంగలు, ఇంకొల్లు రోడ్డులోని డ్రైఫ్రూట్స్ దుకాణంతోపాటు, సమీపంలోని ఆర్‌ఆర్ సెల్ షోరూంలోకి కూడా చొరబడ్డారు. ఆయా దుకాణాల్లో దొరికిన కాడికి నగదుతో పరారయ్యారు. ఆటో మొబైల్ దుకాణంలో కంపెనీ వారికి చెల్లించేందుకు షాపులో భద్రపరిచిన రూ.85వేల నగదుతో పాటు, సీసీ కెమెరాకు సంబంధించిన రూ.10వేల విలువ చేసే డీవీఆర్ అపహరణకు గురైందని బాధితుడు వాపోయారు. డ్రైఫ్రూట్స్ షాపులో రూ.20వేలకు పైగా నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపారు. సెల్‌షాప్‌లో సీసీ కెమెరా డీవీఆర్, రూ.5వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపారు. మరో చిల్లర దుకాణంలో రూ.2వేల నగదు మాత్రమే అపహరణకు గురైంది. ఉదయాన్నే షాపును తెరిచేందుకు వచ్చిన యజమా నులు చోరీ జరిగినట్లు గుర్తించి లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మాల్యాద్రి తన సిబ్బందితో ఆ దుకాణాలను పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించారు. ఎంత నగదు చోరీకి గురైందీ విచారణలో తేలాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

ఆధారాలు లేకుండా జాగ్రత్త

దుకాణాల్లోకి ప్రవేశించిన దొంగలు తమకు సంబంధించిన ఆనవాళ్లు, ఆధారాలు లేకుండా అక్కడున్న సీసీ కెమెరాల్లోని డీవీఆర్‌ను తొలగించి మరీ చోరీలకు పాల్పడడంపై అందరూ భయాందోళనకు గురయ్యారు.

నైట్ బీట్‌పై విమర్శలు

సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తే.. రాత్రి 12.45 గంటలకే చోరీ జరిగినట్లు నమోదు అయింది. ప్రధాన రహదారిలో ఒకేరోజు రాత్రి నాలుగు దుకాణాలలో చోరీ జరగడంతో అసలు నైట్ బీట్ పోలీసుల పర్యవేక్షణపై సర్వత్రా విమర్శలు కురిపిస్తున్నాయి.



డ్రైఫ్రూట్స్ దుకాణంలో ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

వరుస చోరీలతో ప్రజల బెంబేలు

ఒకే రోజు నాలుగు దుకాణాల్లో దొంగలు చోరీకి పాల్పడడంతో ఇటు ప్రజలతో పాటు వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. మరో పక్క సమీపంలోని అద్దంకి పట్టణంలో గత రాత్రి దొంగలు బీభత్సం చేసి పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లడం ప్రజలకు కలవరానికి గురిచేస్తోంది. సిబ్బంది కొరత కూడా ఒకింత పోలీసులకు తలనొప్పిగా మారింది. చాలీచాలని పోలీసులతో నిఘాను మమ అనిపిస్తున్నట్లు కన్పిస్తుంది.

మానవ హక్కులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న దాసరి

చీరాలటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మానవ మనుగడకు దోహదపడే హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఐఎస్ఐ సంస్థల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జాయింట్ కో-ఆర్డినేటర్ న్యాయవాది కరుణరావు, ఆర్‌టీఐ రిసోర్స్ పర్సన్ దాసరి ఇమ్మానియేల్ అన్నారు. పట్టణంలోని పచ్చతోరణం కల్యాణ మండపంలో ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ బెంగళూరు వారి సహకారంతో స్వచ్ఛంద సంస్థలు కార్డ్స్, జేఎంజే, కామధేను సంయుక్తంగా నిర్వహించిన మూడు రోజుల హక్కులపై శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హక్కులను ఏవిధంగా వినియోగించుకోవాలి, వాటి ప్రాధాన్యతపై శిక్షణ అందించారు. శనివారంతో శిక్షణ పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాదెండ్ల కోటేశ్వరరావు, సుజాత, ఉమా, యువతీయువకులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రయోజనాన్ని రైతులకు చెప్పండి

మార్టూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు అందరూ పంటల బీమా పథకం అవగాహన పెంచుకొని వినియోగించుకునేలా కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. గురువారం మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో అద్దంకి, పర్చూరు, మార్టూరు సబ్ డివిజన్ పరిధిలోని 10 మండలాలకు చెందిన వ్యవసాయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా రామకృష్ణ మాట్లాడారు. రబీలో పంటలకు బీమా చెల్లించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉప్పునీటిపరిశోధనా స్థానం బాపట్ల ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు పీ మధువాణి మాట్లాడుతూ భూసార పరిరక్షణ, సమస్యాత్మక నేలల యాజమాన్యంపై మాట్లాడారు. జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఎం.విజయనిర్మల మాట్లాడుతూ రబీ పంటలపై సిబ్బందికి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు టీ రత్నకుమారి, మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, అద్దంకి ఏడీఏ కె.ధనరాజ్, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ